ఈనాటి
# తెలుగోడు
PRGI-NO-APTEL/25/A2739
EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com
సంపుటి-1 | సంచిక - 176 | గురువారం 26 మార్చి 2026 | పేజీలు - 8 | వెల - రూ.. 5
Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati

Ph:8368102842
నాశా క్లినిక్
డా. భానుప్రకాష్ MBBS
సంప్రదించు వేళలు: ఉ.7.30 నుంచి 8.30 వరకు
సా.4 గం.నుంచి రాత్రి.8.30 వరకు
డా. నిహారిక BHMS
సంప్రదించు వేళలు:
ఉ.9 గం. నుంచి సా.5 గం. వరకు
Ph:9704461510
మా మెడికల్స్
ఎమ్మార్వో ఆఫీస్ ఎదురుగా ఓ.డి.చెరువు

## ఆర్డిటి ఎఫ్‌సిఆర్‌ఏ పై
# క్రెడిట్ పోరు!

- మేమే సాధించాం అంటున్న రాజకీయ పక్షాలు...
- టిడిపి, వైసిపి మధ్య ప్రకటనల యుద్ధం ...
- ఏడాది ఎదురుచూపు తర్వాత కేంద్రం గ్రీన్ సిగ్నల్...
- సంస్థపై రాజకీయ ఒత్తిళ్ల భయం...
- సేవా కార్యక్రమాలపై ప్రభావం పడుతుందా..?



**అనంతపురం (తెలుగోడు), మార్చి 25 :**

అనంతపురంలోని ఆర్డిటి సంస్థకు ఎఫ్‌సిఆర్‌ఏ పునరుద్ధరణ లభించడంతో రాజకీయంగా కొత్త వివాదానికి తెరలేచింది. ఈ విజయానికి తామే కారణమని టిడిపి, వైసిపి నాయకులు పరస్పరం పోటీ పడుతూ తమ ఉనికిని చాటుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. ఆర్డీటి ఎఫ్‌సీ ఆర్ ఏ సమస్య తీరిందని తెలియగానే రాజకీయ నాయకులు పోటాపోటీగా వార్తా పత్రికల్లో వారివల్లే సమస్య పరిష్కారం అయ్యిందని వార్తలు రాయించుకోవడమే ఇందుకు నిదర్శనం. ముఖ్యంగా ఆర్డిటి ప్రభావం ఉన్న ప్రాంతాల్లో ఈ అంశం రాజకీయంగా మరింత వేడి పుట్టిస్తోంది. గతంలో దశాబ్దాల పాటు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనసాగిన ఆర్డిటి ఎఫ్‌సిఆర్‌ఏ అనుమతి, గత ఏడాది అకస్మాత్తుగా సమస్యగా మారింది. దీంతో ఆర్డిటి కార్యకలాపాలు అనిశ్చితిలో పడగా, స్థానిక ప్రజలు, సేవా సంఘాలు ఆందోళనకు గురైన విషయం విదితమే.. ఏడాది కాలంగా నిరసనలు, వినతులు, పోరాటాలు, మంతనాలు కొనసాగిన తర్వాత కేంద్ర ప్రభుత్వం సమస్యను పరిష్కరించడం సంతోషించదగ్గ విషయం. అయితే ఈ పరిణామాన్ని తమకే క్రెడిట్‌గా మలుచుకోవడంలో రాజకీయ పార్టీలు ముందంజలో ఉన్నాయి. తాము నిరంతరం మంతనాలు చేయకపోతే సమస్య పరిష్కారం అయ్యేది కాదని టిడిపి నాయకులు చెబుతుండగా, తమ నిరసనలు, పోరాటాల వల్లే కేంద్రం స్పందించిందని వైసిపి నేతలు వాదిస్తున్నారు. దీంతో ఎవరి పాత్ర ఎంత అనే చర్చ కంటే, క్రెడిట్ ఎవరిది అనే వాదోపవాదాలే ముందుకు వస్తున్నాయి. ఇదే సమయంలో మరో కోణం కూడా వెలుగులోకి వస్తోంది. ఎఫ్‌సిఆర్‌ఏ అనేది రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉండే విషయం కాదని, ఇది పూర్తిగా కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలోనే ఉంటుందని నిపుణులు గుర్తుచేస్తున్నారు. ఈ నేపథ్యంలో పునరుద్ధరణకు 2లో




# దేశంలో పెట్రోల్, డీజిల్ కొరతలేదు

- ఇంధన ధరల్లో కూడా మార్పులు లేవు..
- దేశవ్యాప్తంగా పైపులైన్ల విస్తరణ, నేచురల్ గ్యాస్ సరఫరా..
- బ్లాక్ మార్కెటింగ్‌పై దాడులు కొనసాగింపు..
- పైప్డ్ గ్యాస్ అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో దానికే ప్రాధాన్యం..
- ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ మరోమారు ప్రకటన..

**న్యూ ఢిల్లీ (తెలుగోడు), మార్చి 25 :**

పైపులతో నేచురల్ గ్యాస్ కు తాము ప్రాధాన్యం ఇస్తున్నామని, పెట్రోల్, డీజిల్‌కు దేశంలో ఎలాంటి కొరత లేదని, ఇంధనం ధరల్లో కూడా మార్పు లేదని పెట్రోలియం మంత్రిత్వ శాఖ బుధవారంనాడు ప్రకటించింది. వదంతులు నమ్మవద్దని కోరింది. గృహావసరాల కోసం వందశాతం పీఎన్‌జీ సరఫరాకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని పెట్రోలియం శాఖ సంయుక్త కార్యదర్శి సుజాతా శర్మ తెలిపారు. ఈ మేరకు నోటీఫికేషన్ ఇచ్చామని, నిర్దిష్ట కాలపరిమితి లోపు దేశవ్యాప్తంగా పైపులైన్ల విస్తరణ, నేచురల్ గ్యాస్ మౌలిక వసతుల అభివృద్ధి జరగనుందని చెప్పారు. పశ్చిమాసియాలో ఘర్షణల నేపథ్యంలో ఎల్పీజీ, ఇంధనం కొరతపై ఆందోళనలను ప్రస్తావిస్తూ, ప్రజలు ఎలాంటి వదంతులు నమ్మవద్దని, ప్యానిక్ బైయింగ్‌కు పాల్పడవద్దని కోరారు. రిఫైనరీలు గరిష్ట సామర్థ్యంతో పనిచేస్తున్నాయని, ఏటా 26 కోట్ల టన్నుల రిఫైనరీ సామర్థ్యం మనకు ఉందని చెప్పారు. గత రెండు రోజులుగా రిటైల్ ఔట్‌లెట్‌లు, పెట్రోల్ బంకుల వద్ద పెద్దఎత్తున జనం క్యూలు కడుతుండటం తమ దృష్టికి వచ్చిందని, అయితే ఆందోళన అవసరం లేదని, దేశంలో తగినన్ని పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయని చెప్పారు. పెట్రోల్, డిజిల్ ధరలు కూడా పెరగబోవడం లేదని వివరించారు. వలస కార్మికులకు ప్రాధాన్యతా క్రమంలో 5 కిలోల సిలెండర్లు అందిస్తామని సుజాతా శర్మ తెలిపారు. 26 రాష్ట్రాలకు 22,000 టన్నుల ఎల్పీజీ కేటాయించామన్నారు. మంగళవారంనాడు 30,000 ఐదు కేజీల సిలెండర్లు ఇచ్చామని చెప్పారు. బ్లాక్‌మార్కెటింగ్, అక్రమ నిల్వలకు కళ్ళెం వేసేందుకు 2,700 దాడులు జరిపామని, 2,000 సిలెండర్లు స్వాధీనం చేసుకున్నామని అన్నారు. గ్యాస్ రీఫిల్ బుకింగ్ గడువు పెంపుపై వస్తున్న వార్తలు నిజం 2లో

## ఒంటిమిట్టలో
# హరిద్ర ఘటనం
### పసుపు దంచే కార్యక్రమం ప్రారంభం



**కడప (తెలుగోడు), మార్చి 25 :**

కడప జిల్లా ఒంటిమిట్టలోని ప్రసిద్ధ ప్రాచీన ఆలయం శ్రీ కోదండరామస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం పవిత్రమైన హరిద్ర ఘటనం కార్యక్రమంతో ప్రారంభ మయ్యాయి. పసుపు దంచే కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 1న శ్రీ సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించాలని (మిగతా 2లో)

## ఘనంగా ధూళిపాళ్ల నరేంద్ర
# కుమార్తె వివాహం



**గుంటూరు (తెలుగోడు), మార్చి 25 :**

గుంటూరు జిల్లా పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర చిన్న కుమార్తె వివాహానికి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. గుంటూరులోని శ్రీకన్వెన్షన్‌లో నాగసాయి వైదీప్తి- కెవిన్ రామ్ వివాహం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి సీఎంలు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వారితో పాటు ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, మంత్రులు నారా లోకేశ్, పయ్యావుల కేశవ్, అనిత, సంధ్యారాణి, సవిత, పలువురు ఎమ్మెల్యేలు హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యుత్ ఛార్జీల
# పెంపు లేదు
### విద్యుత్ నియంత్రణ మండలి ప్రకటన



**అమరావతి (తెలుగోడు), మార్చి 25 :**

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులకు గుడ్‌న్యూస్ చెప్పింది. 2026 - 2027 ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ ఛార్జీలు పెంచకూడదని నిర్ణయించింది. ఈ మేరకు ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి కీలక ప్రకటన చేసింది. 2026 - 2027 ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ ఛార్జీల పెంపు లేదని తెలిపింది. 2026 - 2027 డిస్కమ్‌ల లోడ్ 15,790 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తానని ముందుకు రావడంతో వినియోగదారులకు బిగ్ రిలీఫ్ దక్కింది. 2024 - 2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ట్రూ అప్ ఛార్జీల విధింపు కూడా నిలిపివేసినట్లు ఏపీఈఆర్‌సీ తెలిపింది. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని కోటి 13 లక్షల మంది గృహ వినియోగదారులకు టారిఫ్ పెంపు నుంచి మినహాయింపు దక్కనుంది. ప్రభుత్వం వాణిజ్య వినియోగదారులకు ఊరట నిచ్చేలా యూనిట్ ధరను 12.25 రూపాయల నుంచి 9. 95 రూపాయలకు తగ్గించింది. ఈ నిర్ణయం ద్వారా 2 లక్షల మంది వాణిజ్య వినియోగదారులకు లబ్ది చేకూరనుంది. అంతేకాదు.. కుటీర పరిశ్రమలకు లోడ్ పరిమితిని 10 హెచ్‌పీ నుంచి 20 హెచ్‌పీకి పెంచింది. రాష్ట్రంలోని 18 వేల మంది కుటీర పరిశ్రమల వినియోగదారులకు లబ్ది చేకూరనుంది.



## యువత స్వశక్తితో
# ఎదగాలి
### కుప్పం జాబ్ మేళాలో నారా భువనేశ్వరి.......

**చిత్తూరు (తెలుగోడు), మార్చి 25 :**

విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలని, భవిష్యత్తుపై స్పష్టత ఉండాలని సీఎం చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి సూచించారు. యువత స్వశక్తితో ఎదగాలన్న ఆమె.. కష్టాన్ని నమ్ముకోవాలని, తద్వారా ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని చెప్పారు. కుప్పం నియోజకవర్గంలోని ఓ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన జాబ్‌మేళాలో సీఎం చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి పాల్గొన్నారు. యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు జాబ్‌మేళా నిర్వహించడం అభినందనీయమని ఈ సందర్భంగా ఆమె అన్నారు. 'నాడు విజన్ 2020.. నేడు విజన్ 2047. ఈ లక్ష్యంతో సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారు. ఒక నాయకుడిని నమ్మి ఓటేస్తే ఏం జరిగిందో గత ఐదేళ్లలో మనం చూశాం. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట తప్పరు. ఓట్ల కోసం హామీలు ఇవ్వరు. ప్రజల కోసంనిలబడతారు. నేను ఏమి చేయగలనో అదే హామీ ఇస్తానని చంద్రబాబు నాతో ఎల్లప్పుడూ చెబుతూ ఉంటారు. ప్రజలకు ఇచ్చినమాట ప్రకారం రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు తీసుకొస్తున్నారు. 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నారు' అని భువనేశ్వరి పేర్కొన్నారు. ఇక తాను గృహిణిగా ఉంటూనే హెరిటేజ్ బాధ్యతలను (మిగతా 2లో)

## 28న అసెంబ్లీ.. అమరావతికి
# ఆమోదం
- ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం..
- రాజధానిగా అమరావతి ప్రకటన..
- కేంద్రానికి పంపి తదుపరి చర్యలు..



**అమరావతి (తెలుగోడు), మార్చి 25 :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాన్ని ఈ నెల 28వ తేదీన నిర్వహిస్తున్నట్లు గవర్నర్ అబ్దుల్ నజీర్ బుధవారం సాయంత్రం అధికారికంగా నోటిఫికేషన్ విడుదల చేశారు. 28వ తేదీ ఉదయం 11 గంటలకు అసెంబ్లీ సమావేశం ప్రారంభం కానుండగా, రాష్ట్ర రాజకీయాల్లో దీనికి విశేష ప్రాధాన్యత ఏర్పడింది. ఈ సమావేశంలో అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా ప్రకటిస్తూ కీలక తీర్మానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. అసెంబ్లీ ఆమోదం అనంతరం ఈ తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపించనున్నారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం రాజధాని అంశంపై పార్లమెంట్ రికార్డుల్లో స్పష్టత ఉండేలా కేంద్రం ద్వారా తదుపరి చర్యలు తీసుకునే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇదిలా ఉంటే, అమరావతి నిర్మాణానికి అవసరమైన నిధుల సమీకరణపై ప్రభుత్వం దృష్టి సారించింది. రాష్ట్ర మంత్రి నారాయణ వెల్లడించిన వివరాల ప్రకారం, కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.15 వేల కోట్లు, హడ్కో ద్వారా మరో రూ.11 వేల కోట్లు సమకూరనున్నాయి. (మిగతా 2లో)

## ఇరాన్‌పై యుద్ధం
# గెలిచాం
- ఇరాన్ ను సైనికంగా అంతంచేసాం
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన



**వాషింగ్టన్ (తెలుగోడు), మార్చి 25 :**

ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధంలో తాము గెలిచామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రటించుకున్నారు. ఈ పోరులో ఇరాన్‌ను సైనికపరంగా అంతమొందించామని ఆయన అన్నారు. ఆ దేశం ఇకపై ఎప్పటికీ అణ్వా యుధాలను అభివృద్ధి చేయకూడదనేదే తమ మొదటి షరతు అని.. దానికి ఇరాన్ అంగీకరించిందని కూడా ట్రంప్ పేర్కొన్నారు. 'ఇరాన్‌తో ప్రస్తుతం చర్చలు కొనసాగు తున్నాయి. అమెరికాతో ఒప్పందం కుదుర్చు కునేందుకు ఆ దేశం ఆసక్తిగా (మిగతా 2లో)

## నియోజకవర్గాల పునర్విభజన
# శుభవార్త
- యుద్ధం పేరుతో ధరల పెంపుపై మండిపాటు..
- మహిళలకు అధిక ప్రాధాన్యం..
- కార్యకర్తలే నాయకులుగా ఎదుగుతారు... మాజీ సిఎం వైయస్. జగన్..



**తాడేపల్లి (తెలుగోడు), మార్చి 25 :**

నియోజకవర్గాల పునర్విభజన రాష్ట్ర రాజ కీయాల్లో కొత్త అవకాశాలకు నాంది పలుకుతుందని మాజీ ముఖ్యమంత్రి జగన్ అన్నారు. ముఖ్యంగా మహిళలకు చట్టసభల్లో మరింత ప్రాతినిధ్యం లభించే దిశగా ఇది కీలక పరిణామమని పేర్కొన్నారు. సీట్ల సంఖ్య పెరగడం వల్ల సామాన్య కార్యకర్తలకు నాయకత్వ అవకాశాలు విస్తరిస్తాయని, ప్రజలకు మరింత చేరువగా పాలన సాగించే అవకాశం ఏర్పడుతుందని అభిప్రాయపడ్డారు. పార్టీ బలోపేతానికి, సామాజిక సమతుల్యతకు ఈ నిర్ణయం దోహదపడుతుందని తెలిపారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో అద్దంకి నియోజకవర్గ నేతలతో సమావేశమైన మాజీ ముఖ్యమంత్రి జగన్ పలు అంశాలపై స్పందించారు. ప్రస్తుతం యుద్ధం పేరుతో నిత్యవసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచుతున్నారని విమర్శించారు. వంటనూనె ధరలు లీటర్కు నలభై రూపాయల వరకు పెరిగాయని, పప్పుల ధరలు కిలోకు పదిహేను రూపాయలకు పైగా పెరిగాయని అన్నారు. గ్యాస్ సిలిండర్లను రెండు వేల నుండి మూడు వేల రూపాయల వరకు అమ్ముతున్నారని ఆరోపించారు. ఇప్పుడు కిరోసిన్ ఇస్తామని చెప్పడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. వ్యవసాయ రంగం కూడా సంక్షోభంలో ఉందని పేర్కొన్నారు. మొక్కజొన్న, కోకో, శెనగ, అరటి, టమోటా పంటలకు సరైన ధరలు లభించడం లేదని అన్నారు. రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని (మిగతా 2లో)

## అరటి రైతులను
# ఆదుకోండి
- గిట్టుబాటు ధరలు కల్పించండి...
- అరటి గెలలను వేసుకుని రైతులతో ర్యాలీ...
- కడప కలెక్టరేట్ వద్ద ధర్నాకు యత్నం..
- వైఎస్ షర్మిల ...



**కడప (తెలుగోడు), మార్చి 25 :**

అరటి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని వైఎస్ షర్మిల కోరారు. కోల్డ్ స్టోరేజీ సౌకర్యాల విషయంలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నానని తెలిపారు. ఎన్నికల ముందు ప్రచారం కోసం మాత్రమే పులివెందులలో అరటి ప్రాసెసింగ్ యూనిట్‌ను జగన్ ప్రారంభించారని విమర్శలు చేశారు. అరటి రైతుల సమస్యలపై కూడా షర్మిల స్పందించారు. పంట నష్టపోయిన అరటి రైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కడపకు వచ్చిన వైఎస్ షర్మిల రెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి వ్యానులో అరటి గెలలు వేసుకొని ర్యాలీగా కడప కలెక్టరేట్ కు చేరుకున్నారు. పంట నష్టపోయిన అరటి రైతులను తక్షణం ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ జిల్లా జాయింట్ కలెక్టర్ నిధి మీనాకు వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైఎస్ షర్మిల రెడ్డి మాట్లాడారు. పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురం మండలంలోని కసునూరు గ్రామంలో వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలించి, రైతులతో మాట్లాడి వారి కష్టాలను అడిగి తెలుసుకున్నానన్నారు. 2లో

## ఇరాన్ కఠిన
# షరతులు
- గల్ఫ్‌లో అమెరికా స్థావరాల మూసివేత డిమాండ్..
- హిజ్బుల్లాపై దాడులు ఆపాలన్న పట్టుదల..



**టెహ్రాన్ (తెలుగోడు), మార్చి 25 :**

ఇరాన్ యుద్ధ పరిణామాల్లో కొత్త మలుపు చోటుచేసుకుంది. అమెరికా ప్రతిపాదించిన కాల్పుల విరమణ షరతులకు ప్రతిగా ఇరాన్ కఠినమైన నిబంధనలను ముందుకు తెచ్చింది. ఈ షరతులు చూస్తే శాంతి ఒప్పందం సాధ్యం అవుతుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. గల్ఫ్ ప్రాంతంలో ఉన్న అన్ని అమెరికా సైనిక స్థావరాలను మూసివేయాలని ఇరాన్ స్పష్టం చేసింది. యుద్ధం కారణంగా తమకు జరిగిన నష్టానికి ఆర్థిక పరిహారం (మిగతా 2లో)

# ఆర్డీటి ఎఫ్‌సీ ఆర్ ఏ పై క్రెడిట్ పోరు



(మొదటి పేజి (తరువాయి)

ప్రధాన క్రెడిట్ కేంద్ర ప్రభుత్వానిదేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయినప్పటికీ, టిడిపి అనుకూల వర్గాలు తమ పార్టీ కృషి ఫలితమని చెప్పుకుంటే, వైసిపి అనుకూల వర్గాలు తమ పోరాటాల వల్లే ఇది సాధ్యమైందని ప్రచారం చేయడం సహజంగానే కనిపిస్తోంది. ఎక్కడైనా సరే అధికార పార్టీకి చెందిన వారు మంతనాలు చేయడం, ప్రతిపక్షంలో వున్న వారు ఉద్యమాలు చేయడం షరామామూలే. ఇలాంటప్పుడు వైసీపీ నేతలు మేము రోడ్లపైకి వచ్చి ఉద్యమిస్తేనే ప్రతిఫలం దక్కిందని చెప్పుకోవడం, అదేవిధంగా అధికారంలో వున్న టీడీపీ తాము మంతనాలు చేస్తేనే సమస్య పరిష్కారం అయ్యిందని చెప్పుకోవడం వారి వారి ఉనికి చాటుకునేలా కనిపిస్తున్నప్పటికీ ఇరు పార్టీల వాదనా సరైనదేనని చెప్పుకోవచ్చు. ఇక మరోవైపు, ఈ పోరాటంలో ప్రజా సంఘాల పాత్రపై కూడా చర్చ మొదలైంది. ఏడాది కాలంగా ఆర్డిటి కోసం నిరంతరం కృషి చేసిన ప్రజా సంఘాలు, కార్యకర్తలు కూడా తమ పాత్రపై ప్రచారాలు కొనసాగించుకుంటున్నారు. అయితే రాజకీయ నేతలు, ప్రజాసంఘాలు, ఆర్డీటి కోసం నిలబడిన ప్రతి ఒక్కరూ సమస్య పరిష్కారం అయినందుకు సంతోషించి సంబరాలు చేసుకుంటే మంచిదేగానీ తమవల్లే పరిష్కారం లభించిందనేది విమర్శనాత్మకంగా మారుతోంది. ఈ నేపథ్యంలో ఆర్డీటి కోసం మేము నిలబడ్డాం కదా అని సంస్థపై రాజకీయ ఒత్తిళ్లు పెరిగే అవకాశముందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇది సంస్థ స్వతంత్రతకు సవాలుగా మారే ప్రమాదం ఉందని చెప్పుకోవచ్చు. మొత్తంగా చూస్తే, ఆర్డిటి సమస్య పరిష్కారం కావడం పేదలు, లబ్ధిదారులకు ఆనందకర విషయం. అయితే ఈ సానుకూల పరిణామాన్ని రాజకీయంగా మలుచుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయనేది స్పష్టంగా తెలుస్తోంది. పేద ప్రజలకు మేలు జరిగిందనే దానిపై దృష్టి పెట్టకుండా, క్రెడిట్ కోసం పోటీ పడటం దురదృష్టకరమని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పేదల ఇంటి దేవుడుగా నిలిచిన ఆర్డీటి సమస్య పరిష్కారంలో అందరి పాత్ర వుందని భావించి సంస్థ కార్యక్రమాల్లో తలదూర్చేందుకు ప్రయత్నాలు జరగకుండా వుండాలి. మేము మీకోసం పోరాడాం, మాకు ఫలానా కావాలని సంస్థపై ఒత్తిళ్లకు దిగకుండా అవసరం వున్న ప్రతి పేదకూ సాయం చేసే విధంగా కార్యకలాపాలు కొనసాగిస్తున్న ఆర్డీటి స్వతంత్రతకు ముప్పు వాటిల్లకుండా రాజకీయ నాయకులు మిన్నకుండి పోతే బాగుంటుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. సేవా దృక్పథంతో పనిచేస్తున్న సంస్థపై రాజకీయ ప్రభావం పడకుండా అన్ని వర్గాలూ బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

# అరటి రైతుల్ని ఆదుకోండి



(మొదటి పేజి (తరువాయి)

రైతులు తమ దఅష్టికి తెచ్చిన సమస్యలను జిల్లా జాయింట్ కలెక్టర్ వివరించడం జరిగిందన్నారు. అకాల వర్షానికి అరటి తోటలు పూర్తిగా దెబ్బతిని రైతులు పూర్తిగా నష్టపోయారన్నారు. మన రాష్ట్రంలో అరటి 70 నుంచి 80 లక్షల వరకు పండిస్తున్నారని తెలిపారు. 58 శాతం రాయలసీమ నుండి అరటి పండుతోందని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర లేక కొట్టుమిట్టాడుతున్నారన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. టన్ను 26 వేల రూపాయలు పలికిన అరటి ఈరోజు 6 వేల రూపాయల కన్నా తక్కువగా పడిపోయిందన్నారు. దేశంలోనే మన రాష్ట్రంలో బెస్ట్ క్వాలిటీ అరటి పంట సాగు అవుతుందని, ఇతర దేశాలకు ఎక్స్పోర్ట్ చేసుకుంటారన్న నమ్మకంతో రైతులు అరటి పంటను పండించారన్నారు. ప్రస్తుతం రేటు పడిపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు వాపోతున్నారన్నారు. రైతులు పండించిన పంటను గిట్టుబాటు ధర వచ్చేంతవరకు నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజీలు లేక ప్రాసెసింగ్ ఎ÷-లాంట్ లు లేక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కోల్డ్ స్టోరేజీలు, ప్రాసెసింగ్ ఎ÷-లాంట్లు ఏర్పాటు చేయడంతోపాటు మార్కెటింగ్ సపోర్ట్ కల్పించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అరటికి కనీస గిట్టుబాటు ధర 12 వేల రూపాయలు కల్పించాలన్నారు. ధరల స్థిరీకరణ నిధులను రైతుల మేలు కోసం ఉపయోగించాలన్నారు. వైసిపి అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి తమ టార్గెట్ కానే కాదని వైయస్ షర్మిలారెడ్డి అన్నారు. పులివెందుల అరటి రైతులతో కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి సొంత నియోజకవర్గమైన పులివెందులలో ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కూడా కోల్డ్ స్టోరేజ్, ప్రాసెసింగ్ ప్లాంట్ పూర్తిగా ఏర్పాటు చేయలేకపోయారని విమర్శించారు. 2023లో పులివెందులలో ప్రాసెసింగ్ ఎ÷-లాంట్ ప్రారంభించాలని చెప్పుకుంటున్నారన్నారు. ఆయన చెప్పిన మాటల్లో నిజం లేదన్నారు. అసలు నిజం ఏమిటంటే 2024 మార్చి 11న ఎన్నికల కోడ్ వచ్చే ముందు ప్రాసెసింగ్ ఎ÷-లాంట్ పనులు పూర్తిగా కాకపోయినా జగన్మోహన్ రెడ్డి ప్రారంభించారన్నారు. ఏదైనా చెప్పితే అందులో నిజం ఉండాలన్నారు. కుటుంబ వ్యవహారాలు, ఆస్తులకు సంబంధించిన విషయం గురించి మా తల్లి విజయమ్మ ఎవరు మాట్లాడకండి అని చెప్పినా కూడా వైసిపి మాట్లాడుతుందని మండిపడ్డారు. జగన్మోహన్ రెడ్డి తమ టార్గెట్ కానే కాదని, మీరు మమ్మును టార్గెట్ చేస్తూ మాట్లాడితే మేము టార్గెట్ చేస్తామని .సవాలు చేశారు. వైసీపీ జోలికి వెళ్లాల్సిన అవసరం తనకు లేదనివెల్లడించారు. కానీ తనపై విమర్శలు చేస్తే తాను కూడా స్పందించాల్సి వస్తుందని తెలిపారు. తన లక్ష్యం వైఎస్ జగన్మోహన్ రెడ్డి కాదని, అయితే వైసీపీ నేతల వ్యాఖ్యల వల్ల తరచూ వివరణ ఇవ్వాల్సి వస్తోందని అన్నారు. తాను ఎవరినీ కుక్కలతో పోల్చలేదని షర్మిల స్పష్టం చేశారు. విజయమ్మ లేఖ వచ్చిన తరువాత కూడా తమపై విమర్శలు కొనసాగుతుండటంతోనే మొరగడం కుక్కల నైజం అన్నానని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎన్. డి. విజయ జ్యోతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటాన్ మహమ్మద్ అలీ ఖాన్, నియోజకవర్గ ఇన్చార్జ్ లు ధ్రువ కుమార్ రెడ్డి, ఇర్ఫాన్, శివ మోహన్ రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు విజరు సుశీల్ కుమార్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు మాయాన అర్షమతుల్లా ఖాన్, నగర అధ్యక్షులు సయ్యద్ గౌస్ పీర్, ఎన్ఎస్ యుఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు, పాలగిరి శివ, పార్టీ నాయకులు పాల్గన్నారు.

# ఇరాన్‌పై యుద్ధం గెలిచాం

(మొదటి పేజి (తరువాయి)

ఎదురుచూస్తోంది. ఇప్పటికే వారి నౌకాదళం, వైమానిక దళం పూర్తిగా ధ్వంసమవడం సహా రాడార్ వ్యవస్థలు కూడా దెబ్బతిన్నాయి. అమెరికా విమానాలు టెహ్రాన్ మీదుగా చక్కర్లు కొడుతున్నాయి. ఒకవేళ చర్చలు విఫలమైతే.. అమెరికా ఏదైనా చేయగలదు' అని ట్రంప్ చెప్పారు. మరోవైపు ఇరాన్.. అమెరికాకు హోర్ముజ్ జలసంధికి సంబంధించి ఓ పెద్ద గిఫ్ట్ ఇచ్చిందని ట్రంప్ తెలిపారు. అయితే.. ఆ బహుమతి ఏంటనే వివరాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. అది చాలా విలువైన గిఫ్ట్ అని చెప్పుకొచ్చారు. అయితే.. ట్రంప్ వ్యాఖ్యలను పూర్తిగా తోసిపుచ్చింది ఇరాన్. అమెరికాతో ఇప్పటివరకు ఎలాంటి ప్రత్యక్ష చర్చలు జరగలేదని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇదిలా ఉండగా.. పాకిస్థాన్, ఈజిప్ట్, టర్కీ వంటి దేశాలతో కలిసి ఇరాన్.. అమెరికాతో మధ్య మధ్యవర్తిత్వం వహించేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు పాక్ సైన్యాధిపతి అసిమ్ మునీర్ ఇటీవల అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్‌తో మాట్లాడినట్టు పాక్ మీడియా సంస్థలు వెల్లడించినట్టు సమాచారం. మరోవైపు.. సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్.. ఇరాన్‌పై దాడులను కొనసాగించాలని ట్రంప్‌ను కోరినట్టు న్యూయార్క్ టైమ్స్ తన కథనంలో రాసుకొచ్చింది. యుద్ధానికి ట్రంప్ 5 రోజుల విరామం ప్రకటించినప్పటికీ.. గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు కొనసాగుతున్నాయి. సౌదీ అరేబియా బాలిస్టిక్ క్షిపణి ఇరాన్‌కు చెందిన 6 డ్రోన్‌లను కూల్చివేసింది. తూర్పు ప్రావిన్సులో తమ వాయు రక్షణ వ్యవస్థ ఒక బాలిస్టిక్ క్షిపణిని అడ్డుకుని ధ్వంసం చేసిందని సౌదీ రక్షణ శాఖ తెలిపింది. ఆ వివరాల ప్రకారం.. అదే ప్రాంతంలో కనీసం 6 డ్రోన్‌లను కూల్చివేసినట్టు సమాచారం. ఇజ్రాయెల్, కువైట్ దేశాలపైనా ఇరాన్ డ్రోన్ల దాడి కొనసాగిస్తున్నట్టు అంతర్జాతీయ మీడియా కథనాల ద్వారా తెలుస్తోంది.

# ఒంటిమిట్టలో హరిద్ర ఘటనం



(మొదటి పేజి (తరువాయి)

తిథిదే అధికారులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో రాములోరి కల్యాణానికి మంగళవారం హరిద్రా ఘటనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం బ్రహ్మోత్సవాలు మరియు శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాలకు శ్రీకారం చుట్టే తొలి ఆచారంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు, శ్రీవారి సేవకులు, టీటీడీ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని పసుపు కొమ్ములను దంచే పవిత్ర కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. హరిద్ర ఘటనంలో సిద్ధం చేసిన తాజా పసుపును స్వామివారికి నిర్వహించే స్నపన తిరుమంజనం కార్యక్రమంలో ఉపయోగిస్తారు. అలాగే శ్రీ సీతారాముల కల్యాణోత్సవానికి అవసరమైన తలంబ్రాలు సిద్ధం చేయడానికి కూడా దీనిని వినియోగిస్తారు. ముందుగా పసుపు కొమ్ములు ఇతర పరికరాలను గర్భాలయంలో ప్రతిష్టించి పూజలు నిర్వహించారు. అనంతరం మహాలక్ష్మి ఆరాధన చేశారు. శ్రీ సూక్తం పఠనానంతరం హరిద్ర ఘటనం నిర్వహించారు. పసుపు నూరిన తరువాత సమర్పణ చేసి తాంబూలం అందజేయడంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో ఎ. ప్రశాంతి, డీఈ (ఎలక్ట్రికల్) సరస్వతి, పీఆర్ఓ ఎఫ్ఏసీ కుమారి నీలిమ, సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఆలయ ఇన్స్పెక్టర్ నవీన్, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాక్‌లాగా భారత్ దళారీ దేశం కాదు

## అఖిలపక్షంలో విదేవాంగ మంత్రి జైశంకర్



**న్యూ ఢిల్లీ(తెలుగోడు), మార్చి 25 :** పాకిస్థాన్‌ను 'దళారీ' దేశంగా కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ అభివర్ణించారు. పాకిస్థాన్‌లాగా భారతదేశం ఎప్పుడూ మధ్యవర్తిత్వం నెరపే దేశం, దళారీ దేశం కాదని అన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్ని ఉద్రిక్తతలపై కేంద్రం నిర్వహించిన అఖిల పక్ష సమావేశంలో జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేసినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. పశ్చిమాసియాలో యుద్ధానికి ముగింపు పలికేలా వాషింగ్టన్-టెహ్రాన్‌తో మధ్యవర్తిత్వం వహించేందుకు పాక్ ముందుకు రావడంపై అఖిలపక్ష సమావేశంలో ప్రస్తావనకు వచ్చినట్టు చెబుతున్నారు. దీనిపై జైశంకర్ స్పందిస్తూ, పాకిస్థాన్ దళారీ దేశమని అన్నారు. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయాల్లో భారత్ దళారీ దేశంగా వ్యవహరించదని చెప్పారు. ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం నాలుగో వారానికి చేరుకోవడంతో మధ్యవర్తిత్వం వహించడానికి పాక్ ఉత్సాహం కనబరుస్తోంది. చర్చలకు ఆతిథ్యం ఇచ్చేందుకు తాము సిద్ధమని పాక్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో భారత్ ఎందుకు మౌనంగా ఉందని విపక్షాలు ప్రశ్నించినప్పుడు, భారత్‌కు ప్రత్యేక గౌరవం ఉందని, ఎన్నడూ దళారీ దేశంగా వ్యవహరించదని జైశంకర్ వ్యాఖ్యానించారు.

# ఇరాన్ సమీపంలో దళాలు

## అందుబాటులో 2000 మంది ఎలైట్ బలగాలు



**వాషింగ్టన్ (తెలుగోడు), మార్చి 25:**

ఇరాన్‌తో శాంతి చర్చలు జరుగుతున్నట్లు చెప్పిన ట్రంప్.. మరో కీలక ఆదేశం ఇచ్చారు. ఇరాన్ భూభాగానికి సమీపంలో రెండు వేల మంది పారాట్రూపర్లను మోహరించారు. ఏ క్షణమైన వాళ్లు దాడికి పాల్పడే అవకాశాలు ఉన్నాయి. భూతల దాడులు చేస్తే తిప్పికొడుతామని ఇరాన్ చెబుతున్న నేపథ్యంలో.. పెంటగాన్ అధికారులు కొత్త ఆదేశాలు జారీ చేశారు. అమెరికన్ ఆర్మీలోని 82వ ఎయిర్‌బార్న్ డివిజన్‌కు చెందిన సుమారు 2000 మంది ఎలైట్ బలగాలు అందబాటులో ఉండనున్నాయి. ఇరాన్ భూభాగానికి అతిసమీపంగా ఆ దళాలు మోహరించి ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై అమెరికాకు చెందిన వాషింగ్టన్ పోస్టు, న్యూయార్క్ టైమ్స్ కథనాలు రాశాయి. ఆదేశాలు ఇచ్చిన 18 గంటల లోపే విమానాశ్ర యాలను, ఎంబసీలను సీజ్ చేసే సత్తా ఈ దళానికి ఉంటుంది. వీలైనంత మందిని తరలించగలరు కూడా. ఈ వారం చివరలో మరో 2500 మెరైన్లు కూడా గ్రౌండ్ ఆపరేషన్ కోసం సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఖర్గ్ దీవిలో ఉన్న ప్రధాన ఆయిల్ ఎగుమతి కేంద్రాన్ని సీజ్ చేయాలన్న ఉద్దేశంతో అమెరికా ఉన్నట్లు భావిస్తున్నారు. దీని కోసమే పారాట్రూపర్లు రెఢీ అవుతున్నట్లు అంచనా వేస్తున్నారు. ఇరాన్‌కు సమీపంగా వస్తే అమెరికా సైనికులను ఎలా ఎదుర్కోవాలో తమ దళాలకు తెలుసు అని ఇటీవల ఇరాన్ సీనియర్ మిలిటరీ అడ్వైజర్ అలీ అక్బర్ అహ్మదిన్ వార్నింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఎయిర్‌బార్న్ డివిజన్ బేస్ నార్త్ కరోలినాలో ఉన్నది. ఆదేశాలు ఇచ్చిన 18 గంటల్లోనే ఈ ప్రాంతం నుంచి టా÷-గ్గ÷ట్‌కు ఈ దళం వెళ్లగలదు. ఇమ్మిడియేట్ రెస్పాన్స్ ఫోర్స్(ఐఆర్ఎఫ్) అని కూడా ఈ దళాన్ని పిలుస్తారు. 2021లో ఈ దళం ఆఫ్ఘనిస్తాన్ ఆపరేషన్‌లో పాల్గొన్నది. ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా ప్రభుత్వం తమ ఆపరేషన్స్ నిలిపివేసిన సమయంలో.. హమిద్ ఖర్జాయ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఈ దళం వెళ్లింది. ఎయిర్‌బార్న్ డివిజన్‌లో మొత్తం మూడు కంబాట్ బృందాలు ఉంటాయి. ఒక్కొక్క బృందంలో సుమారు 4 వేల మంది సైనికులు ఉంటారు. ఏవియేషన్ బ్రిగేడ్‌లో అటాక్, ట్రాన్స్‌పోర్ట్, కార్గో హెలికాప్టర్లు ఉంటాయి. ఓ ఆర్టిల్లరీ యూనిట్, లాజిస్టిక్స్ బ్రిగేడ్ కూడా ఉంటాయి. 82వ ఇన్‌ఫాంట్రీ డివిజన్‌ను మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో ఏర్పాటు చేశారు. కానీ యుద్ధం ముగిసిన తర్వాత డిమొబిలైజ్ చేశారు. అయితే మళ్లీ రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఈ సైనిక బృందాన్ని తీసుకొచ్చారు. 1942లో అమెరికన్ ఆర్మీకి చెందిన ఫస్ట్ ఎయిర్‌బార్న్ డివిజన్‌గా రూపాంతరం చెందింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత 82వ ఎయిర్‌బార్న్ దళం పలు యుద్ధాల్లో పాల్గొన్నది. వియత్నం, గ్రెనడా, పనామా, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్, పశ్చిమాసియాలో ఐసిస్ ఆపరేషన్స్‌లో ఈ దళం విధులు నిర్వర్తించింది.

# యువత స్వశక్తితో ఎదగాలి

(మొదటి పేజి (తరువాయి)

సవాల్‌గా స్వీకరించానని భువనేశ్వరి చెప్పుకొచ్చారు. 'జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలి. ప్రతిదానికీ అసంతృప్తికి లోనుకాకూడదు. కష్టపడి పనిచేస్తే ఎన్నో అవకాశాలు వస్తాయి. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లలను చదివిస్తారు. మంచి ప్రయోజకులు కావాలని, భవిష్యత్తు బావుండాలని తాపత్రయపడతారు. పిల్లలు జీవితంలో ఉన్నతంగా స్థిరపడితే ముందుగా సంతోషించేది తల్లిదండ్రులే. చంద్రబాబు రాజకీయాల్లో బిజీగా ఉండటంతో నా కుమారుడు లోకేశ్ పెంపకం, చదువు బాధ్యతలు నేనే చూసుకున్నాను. ఏది మంచి, ఏది చెడు అనేది చెప్పి పెంచాను' అని సీఎం సతీమణి తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు.

# అమరావతికి ఆమోదం

(మొదటి పేజి (తరువాయి)

అమరావతిలో అసెంబ్లీ, హైకోర్టు, ఐదు టవర్లతో ఐకానిక్ భవనాల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా అసెంబ్లీ భవనం సుమారు 250 మీటర్ల ఎత్తుతో నిర్మించబడుతుందని, ప్రజలు పైభాగానికి చేరుకుని మొత్తం నగరాన్ని వీక్షించేలా ప్రత్యేక ఏర్పాట్లు ఉంటాయని ఆయన వివరించారు.

# నియోజకవర్గాల పునర్విభజన శుభవార్త

(మొదటి పేజి (తరువాయి)

తెలిపారు.పరిశ్రమల విషయంలో కూడా క్రెడిట్ దోపిడీ జరుగుతోందని ఆరోపించారు. స్టీల్ ప్లాంట్ వ్యవహారంలో తమ పాలనలోనే పెట్టుబడులకు పునాది పడిందని, భూముల గుర్తింపు కూడా తమ హయాంలోనే జరిగిందని చెప్పారు. ఇప్పుడు ఇతరులు దానికి క్రెడిట్ తీసుకుంటున్నారని విమర్శించారు. సాంకేతిక రంగ ప్రాజెక్టుల విషయంలో కూడా ఇదే పరిస్థితి ఉందన్నారు.బల్క్ డ్రగ్ పార్క్ విషయంలో కూడా అడ్డంకులు సృష్టించారని పేర్కొన్నారు. ఎక్కువ భూమి కావాలని వివాదాలు సృష్టించడం వల్ల ప్రాజెక్ట్ ముందుకు సాగడం లేదని అన్నారు. తమ పాలనలో ప్రారంభించిన మూడు ప్రభుత్వ రంగ పోర్టుల పనులు కూడా ఇప్పటివరకు వేగం అందుకోలేదని విమర్శించారు. పోర్టుల పరిసర ప్రాంతాల్లో మళ్లీ భూములు సేకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.రాబోయే రోజుల్లో పార్టీలో కష్టపడే కార్యకర్తలకు పెద్దపీట వేస్తామని స్పష్టం చేశారు. నియోజకవర్గాల సంఖ్య పెరగడం వల్ల కార్యకర్తలకు నాయకత్వ అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. తదుపరి దశలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని, కార్యకర్తలే భవిష్యత్తు నాయకులని పేర్కొన్నారు.

# ఇరాన్ కఠిన షరతులు

(మొదటి పేజి (తరువాయి)

పరిహారం చెల్లించాలని కూడా డిమాండ్ చేసింది. ఇదే సమయంలో హిజ్బుల్లాపై ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న దాడులను పూర్తిగా నిలిపివేయాలని తేల్చిచెప్పింది.ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన హోర్ముజ్ జలసంధిపై పూర్తి నియంత్రణ తమకు ఇవ్వాలని ఇరాన్ కోరింది. ఆ మార్గంలో వెళ్లే నౌకలపై రుసుములు వసూలు చేసే హక్కు కూడా తమకే ఉండాలని పేర్కొంది. ఈ డిమాండ్లు అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారాయి.ఇందుకు ప్రతిగా ఇరాన్ కొన్ని కీలక హామీలు కూడా ఇవ్వడానికి సిద్ధమని తెలిపింది. తన బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమాన్ని ఐదేళ్లపాటు నిలిపివేయడం, యురేనియం శుద్ధి స్థాయిలను తగ్గించడం వంటి నిర్ణయాలు తీసుకుంటామని వెల్లడించింది. అలాగే అణు స్థావరాలను అంతర్జాతీయ అణుశక్తి సంస్థ తనిఖీలకు అనుమతించేందుకు సిద్ధమని తెలిపింది.ఇరు పక్షాల మధ్య పరోక్ష చర్చలు కొనసాగుతున్నప్పటికీ, షరతుల తీవ్రత కారణంగా ఒప్పందం త్వరగా కుదిరే అవకాశాలు తగ్గుతున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. పరిస్థితులు ఎలా మారుతాయో అన్న ఉత్కంఠ కొనసాగుతోంది.

# స్థిరంగానే భారత్ ఇంధన భద్రత

**మరిన్ని నౌకలు భారత్‌కు చేరుకునే అవకాశం**

**పశ్చిమాసియా పరిస్థితులపై అఖిలపక్షంలో ప్రభుత్వం వివరణ**

**సమస్య ఎదుర్కొనేందుకు ఉమ్మడిగా సాగాలని నిర్ణయం**

**న్యూఢిల్లీ (తెలుగోడు), మార్చి 25 :**

భారతదేశ ఇంధన భద్రత స్థిరంగా ఉందని, అదనపు సరకుతో నౌకలు వస్తున్నాయని కేంద్ర అన్ని రాజకీయ పార్టీలకు భరోసా ఇచ్చింది. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన బుధవారం సాయంత్రం పార్లమెంటు భవనంలో అఖిల పక్ష సమావేశం జరిగింది. ఒక గంటా 45 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పురి, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి, కాంగ్రెస్ నేతలు ముకుల్ వాస్నిక్, తారిఖ్ అన్వర్, సమాజ్‌వాదీ పార్టీ నేతలు ధర్మేంద్ర యాదవ్,జావెద్ అలీ, సీపీఎం నేత జాన్ బ్రిట్టాస్, ఎల్‌జేపీ నేత అరుణ్ భారతి, డీఎంకే నేత పి.విల్సన్, ఆప్ ఎం సంజయ్ సింగ్, జేడీయూ నేత రాజీవ్ సింగ్, సంజయ్ ఝా తదితరులు పాల్గొన్నారు. టీఎంసీ నుంచి ఎవరూ హాజరుకాలేదు. అఖిలపక్ష సమావేశానంతరం కిరణ్ రిజిజు మాట్లాడుతూ, సమావేశంలో అన్ని పార్టీలు చురుకుగా పాల్గొన్నాయని, ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా మధ్య జరుగుతున్న యుద్ధం, భారత్‌పై దాని ప్రభావంపై సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశాయని తెలిపారు. ప్రభుత్వం సమగ్రంగా, సంపూర్ణంగా స్పందించిందని, విపక్షాలందరి ప్రశ్నలన్నింటికీ సంతృప్తికరంగా సమాధానాలి చ్చిందని చెప్పారు. ప్రస్తుత పరిస్థితిని సమర్థవంతగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వానికి మద్దతుగా నిలబడతామని విపక్ష పార్టీలు హామీనిచ్చాయని చెప్పారు. 'ప్రస్తుత సంక్షోభ సమయంలో పరిస్థితికి అనుగుణంగా ప్రభుత్వం తీసుకునే చర్యలకు సమష్టిగా మద్దతు ఇస్తామని విపక్షాలు తెలిపాయి' అని రిజిజు వివరించారు. కాగా, దేశంలో ఇంధన భద్రత స్థిరంగా, దేశ ఇంధన అవసరాలకు సరిపడా ఉందని అఖిలపక్ష సమావేశంలో ప్రభుత్వం పేర్కొన్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. సరకు కోసం అడ్వాన్స్ బుకింగ్ చేసుకోవడంతో పాటు వివిధ దేశాలతో సంప్రదింపులు సాగిస్తున్నామని, నిరంతరాయ ఇంధన సరఫరాకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని ప్రభుత్వం హామీ ఇచ్చినట్టు పేర్కొన్నాయి. ఎల్‌జీపీ లభ్యత, హోర్ముజ్ జలసంధి మీదుగా షిప్‌మెంట్‌పై సమావేశంలో విపక్షాల ఆందోళన వ్యక్తం చేశాయి. అయితే పరిస్థితి అదుపులోనే ఉందని, మరో నాలుగైదు రోజుల్లో నాలుగు నౌకలు పోర్టుకు చేరుకుంటాయని ప్రభుత్వం తెలిపింది. ఎలాంటి ఇంధన కొరత లేదని, తగినన్ని నిల్వలు ఉన్నాయని వివరించింది. అఖిలపక్షానికి హాజరైన అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామని, విపక్షాలతో ఏ సమయంలోనైనా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపింది. దేశ ప్రజల ప్రయోజనాలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, విపక్షాలతో చర్చలకు తలుపులు తెరిచే ఉంటాయని రాజ్‌నాథ్ అఖిలపక్ష సమావేశంలో పేర్కొన్నారు. యుద్ధంతో తలెత్తిన పరిణామాలు, ఇంధన భద్రతపై ఆందోళనలు, ప్రపంచ వ్యాప్తంగా ఎదురవుతున్న సవాళ్లను విదేశాంగ కార్యదర్శి మిస్రీ అఖిల పక్ష నేతలకు వివరించారు. మొత్తం మీద.. పరిస్థితులు అదుపులోనే ఉన్నాయని, దేశీయంగా ప్రజల ఆందోళనలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందనే సందేశాన్ని అఖిలపక్ష సమావేశం ఇచ్చింది.

## హెచ్.పి గ్యాస్ ఏజెన్సీ తనిఖీ

**జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్..**

**తాడిపత్రి (తెలుగోడు), మార్చి 25:**
తాడిపత్రి పట్టణం కడప రోడ్డులోని హెచ్.పి గ్యాస్ ఏజెన్సీని బుధవారం జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హెచ్.పి.సి.ఎల్ గ్యాస్ ఏజెన్సీకి సంబంధించి వేజ్ ఎంటర్ ప్రైజెస్ ను తనిఖీ చేసి, రిజిస్టర్స్ ను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఏజెన్సీలో గత 15 రోజుల నుంచి ఎన్ని బుకింగ్ లు, డెలివరీలు జరిగాయి, బ్యాక్లాగ్ ల గురించి జాయింట్ కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్యాస్ సరఫరాను సజావుగా చేపట్టాలని సూచించారు. అనంతరం పట్టణంలోని శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి దేవాలయాన్ని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ సందర్శించారు. తదనంతరం పెద్దపప్పూరు మండలంలోని జోడిధర్మపురం గ్రామంలో పెట్రోల్ బంక్ కోసం స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సోమశేఖర్, సీఎస్డీటి మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.


గ్యాస్ రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్


విద్యార్థినులకు క్రీడా పరికరాలను అందజేసిన ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి

## క్రీడా పరికరాలను అందజేసిన ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి

**తాడిపత్రి (తెలుగోడు), మార్చి 25:**
స్థానిక ఆంజనేయ స్వామి మాన్యంలోని ప్రభుత్వ కేజీబీవీ మైనారిటీ పాఠశాల విద్యార్థులకు బుధవారం క్రీడా పరికరాలను శాసనసభ్యులు జేసీ అస్మిత్ రెడ్డి అందజేశారు. మధ్యాహ్నం ప్రభుత్వ కేజీబీవీ మైనారిటీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అనీ ఎమ్మెల్యే జేసీ విద్యార్థులకు అడుగగా, ఆటలు ఆడుకోవడానికి ఎలాంటి పరికరాలు లేవని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే విద్యార్థులకు కావాల్సిన ఆట పరికరాలు రోజు మారకుండానే, విద్యార్థులకు అందజేశారు. దీంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ షేక్షవలి, మాజీ కౌన్సిలర్లు విజ్జి, సుశీలమ్మ, ఆంజనేయ స్వామి మాన్యం టీడీపీ ఇన్‌ఛార్జ్ కత్తి రామంజులు రెడ్డి విద్యార్థులకు క్రీడా పరికరాల కిట్లు అందజేశారు.


వివరాలు అడుగుతున్న జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్

## పప్పుశెనగ, కందుల కొనుగోలు కేంద్రం పరిశీలన

**జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్..**

**తాడిపత్రి (తెలుగోడు), మార్చి 25:**
స్థానిక మార్కెట్ యార్డ్‌లో బుధవారం పప్పుశనిగ, కందుల కొనుగోలు కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ పరిశీలించారు. మార్కెట్ యార్డ్‌లో పప్పుశెనగ, కందుల ఏ విధంగా కొనుగోలు చేస్తున్నారని జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ అడిగారు. ఏ విధంగా కొనుగోలు బిల్స్ వేస్తున్నారని, నగదు రైతులకు ఎన్ని రోజుల్లో పడుతుందని, క్యూఆర్ కోడును బ్యాగులకు ఎలా ట్యాగ్ చేస్తారని, ఎందుకు క్యూఆర్ కోడ్ బ్యాగులకు అతికించడం జరుగుతుందని అధికారులను అడిగారు. హమాలీ చార్జెస్ ఎంత పడుతుందని అధికారులను అడగడం జరిగింది. అదేవిధంగా కొనుగోలులో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయాని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సోమశేఖర్, సి.ఎస్.డి.టి మల్లేష్, మార్క్ఫెడ్ డిఎం పుణేశ్వరి, మండల వ్యవసాయ అధికారి ఆంజనేయులు, మార్కెట్ యార్డ్ కార్యదర్శి రంగనాథ సూపర్ వై రామచంద్రుడు, ఎర్రగుంటపల్లి పిఎసిఎస్ సీఈవో రామ్ నారాయణ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## ఆర్డిటికి ఎఫ్ సి ఆర్ ఏ అనుమతులు కూటమి ప్రభుత్వం సాధించిన విజయం

**ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ..**

**గుత్తి (తెలుగోడు), మార్చి 25:**
పేదలపాలిటీ పెన్నిధిలో ఉన్న ఆర్టిటి సంస్థ ఎఫ్ సి ఆర్ ఎ నెంబర్ను పునరుద్ధరించడంలో కూటమి ప్రభుత్వం విజయం సాధించిందని గుంతకల్లు నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. బుధవారం గుత్తి టిడిపి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ జిల్లాలో పేదల కల్పవృక్షం అయిన ఆర్డిటి సంస్థ యొక్క ఎఫ్ సి ఆర్ ఏ అనుమతులు గత కొద్దికాలంగా నిలిపివేశారన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు , యువ నాయకుడు ఐటి శాఖ మాత్యులు నారా లోకేష్ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఎన్నోసార్లు విన్నవించడం ద్వారా ఎఫ్ సి ఆర్ ఏ అనుమతులు పునరుద్ధరించారన్నారు. ఈ ఈ ఘనత సాధించినందుకు అనంతపురం జిల్లా , గుంతకల్లు నియోజకవర్గం ప్రజల తరపున నారా చంద్రబాబు నాయుడు, లోకేష్ బాబు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. అనంతపురం జిల్లాలో పేదల పాలిట కల్పవృక్షంగా ఉన్న ఆర్డిటి సంస్థ ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి పేద ప్రజలకు అండగా నిలవడం జరిగిందని గత కొంతకాలంగా ఆర్డిటి సంస్థ ఎఫ్ సి ఆర్ ఏ నిలిచిపోవడం వల్ల పేదలు ఎన్నో రకాలుగా ఇబ్బందులు పడే అవకాశం ఉందని ఖచ్చితంగా ఆర్డిటి సంస్థ యొక్క ఎఫ్సీఆర్ఏ అనుమతులు పునరుద్ధరించే విధంగా అనంతపురం జిల్లా ప్రజా ప్రతినిధులు ముఖ్యమంత్రి కి విన్నవించడం జరిగిందని దీనిద్వారా ఎన్నో పోరాటాల నడుమ ఈరోజు కూటమి ప్రభుత్వం ఆర్డిటి ఎఫ్ సి ఆర్ ఏ అనుమతులను పునరుద్ధరన సాధ్యమైందన్నారు. బత్తలపల్లి ఆర్డిటి హాస్పిటల్‌లో ఎంతోమంది పేదలు తక్కువ వ్యయం తో నాణ్యమైన వైద్యానికి నోచుకొని వారి ఆరోగ్యాలు మెరుగు పరచడానికి ఆర్డిటి సంస్థ ఎంతో కృషి చేస్తుందన్నారు. సంస్థ సేవలను తిరిగి పునరుద్ధరించడంలో కూటమి ప్రభుత్వం చేసిన కృషి ప్రశంసనీయమని ఎమ్మెల్యే జయరాం కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వెంకన్న పల్లి సర్పంచ్ పాటిబండ్ల భరత్ గుత్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ జక్కలచెరువు ప్రతాప్ తో పాటు పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు కూటమి నాయకులు పాల్గొన్నారు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

## అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు

**శ్రీ వినాయక బాలాజీ ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ తనిఖీ.. ఆర్డీవో వసంత బాబు..**

**బెళగుప్ప (తెలుగోడు), మార్చి 25:**
ప్రభుత్వం ప్రస్తుత పరిస్థితులలో గ్యాస్ ఏజెన్సీలకు ఇచ్చిన ఆదేశాల ప్రకారం ప్రజలకు గ్యాస్ సిలిండర్లను అందించాలని, ఇటువంటి అక్రమాలకు పాల్పడిన చర్యలు తప్పవని కళ్యాణదుర్గం ఆర్డీవో వసంత బాబు గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులకు హెచ్చరించారు. బుధవారం బెళుగుప్పలోని శ్రీ వినాయక బాలాజీ ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ గోడౌన్‌ను కళ్యాణదుర్గం ఆర్డీవో వసంత బాబు తనిఖీ చేశారు. రీ సర్వేడిటీ గురుబ్రహ్మ కూడా ఆర్డీవో వెంట ఉన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో వసంత బాబు గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు శ్రీధర్ తో మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో ప్రజలకు గ్యాస్ సిలిండర్లను అందించే విషయంలో ప్రభుత్వ నిబంధనలను తప్పకుండా పాటిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అందించాలని సూచించారు. అలాగే వినియోగదారులందరికీ నిబంధనలను పాటిస్తూ గ్యాస్ సిలిండర్లను అందించాలన్నారు. గ్యాస్ సిలిండర్ల పంపిణీ లో ఏవైనా అక్రమాల జరిగితే చర్యలు తప్పని హెచ్చరించారు. అనంతరం స్టాక్ రిజిస్టర్ లను పరిశీలించారు. ఆర్డిఓ వెంట ఆర్ఎస్ డిటి గురుబ్రహ్మ, వీఆర్వో ప్రదీప్ పాల్గొన్నారు


బెళుగుప్పలోని శ్రీ వినాయక బాలాజీ ఇండేన్ గ్యాస్ ఏజెన్సీని తనిఖీ చేస్తున్న ఆర్డిఓ వసంతబాబు


గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు శ్రీధర్‌తో మాట్లాడుతున్న ఆర్డిఓ వసంత బాబు

## ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల సాధనకై ఏపీటీఎఫ్ 1938 కృషి

**నూతన మండల కమిటీ ఎన్నిక.... అధ్యక్షులుగా వి. మారెన్న.**

**బెళగుప్ప (తెలుగోడు), మార్చి 25:**
ఉపాధ్యాయుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యలు, అధ్యారంగ సమస్యల సాధనకై ఏపీటీఎఫ్ 1938 కృషి చేస్తుందని ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర కౌన్సిలర్ గోవర్ధన్ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు వజీర్ భాష, జిల్లా నాయకులు హనుమంతనాయక్ పేర్కొన్నారు. బుధవారం బెళుగుప్ప మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏపీటీఎఫ్ 1938 కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ 1938 మండల నూతన కమిటీను ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర కౌన్సిలర్ గోవర్ధన్ నాయుడు, కౌన్సిల్ పర్యవేక్షకులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ నాయక్, కౌన్సిల్ నిర్వాహకులుగా జిల్లా ఉపాధ్యక్షులు వజీర్ భాష, జిల్లా నాయకులు హనుమంతనాయక్ వ్యవహరించారు.
మండల మండల అధ్యక్షులుగా వి.మారెన్న, మండల ప్రధాన కార్యదర్శిగా యం.ఎర్రిస్వామి, గౌరవ అధ్యక్షులుగా సి. సూర్యనారాయణ, సహాధ్యక్షులుగా కుల్లాయప్ప నాయక్, ఉపాధ్యక్షులుగా ఎం.ప్రభాకర్, జనార్ధన్ అదనపు కార్యదర్శిగా రామస్వామి, కార్యదర్శులుగా ఏం వెంకటేష్ నాయక్, సునీల్ కుమార్, గంగాధర్ లను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైనటువంటి మండల కమిటీ సభ్యులు ఉపాధ్యాయుల ఆర్థిక ఆర్థికేతర సమస్యల సాధన మరియు విద్యారంగ సమస్యల సాధనకై కృషి చేస్తామని ఏపీటీఎఫ్ పోరాటాలలో ముందుండి, ఏపీటీఎఫ్ ఆశయ సాధనకై పనిచేస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ 1938 జిల్లా కౌన్సిలర్లుగా శ్రీనివాస్ నాయక్ ,హనుమంతు నాయక్, గోవర్ధన్ నాయుడు,వజీర్ భాష, సరిత, చెన్న బసయ్య, బ్రహ్మానందరెడ్డి, వెంకటేష్ నాయక్, రాజమోహన్ మహేశ్వర్ గౌడ్ ,ఎల్లప్ప, సురేష్ కుమార్, నాగార్జున రెడ్డి ,రామకృష్ణ, బాలాజీ, ప్రేమ్ కుమార్, గోవిందు, గుండాలప్ప, మహేష్, వేణుగోపాల్ ,షాజహాన్, నరసింహులు మహిళా కమిటీ సభ్యులుగా శైలజ, సరస్వతి, కవిత భాయ్ ఆర్.సుగుణ బాయి , శివలక్ష్మి తదితరులను ఎన్నుకున్నారు.


ఏపీటీఎఫ్ 1938 మండల నూతన కమిటీ సభ్యులు


మండల అధ్యక్షుడు వి.మారెన్న


మండల ప్రధాన కార్యదర్శి ఎం. ఎర్రిస్వామి


మండల గౌరవ అధ్యక్షులు సి.సూర్య నారాయణ

## బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత అందరిది

**అంగన్వాడీ విద్యార్థులకు పోషక విలువలు కలిగిన సమతుల ఆహారం అందించాలి... సిడిపిఓ శ్రీదేవి...**

**బెళగుప్ప (తెలుగోడు), మార్చి 25:**
గ్రామాలలో బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సంఘ సభ్యులకు సిడిపిఓ శ్రీదేవి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన బెళుగుప్ప రవితేజ మండల సమైక్య కార్యాలయంలో సూపర్వైజర్ రమాదేవి, ఏపీఎం సురేఖ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలు, ఇతర విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిడిపిఓ శ్రీదేవి మాట్లాడుతూ ప్రభుత్వాలు బాల్యవివాహాలను అరికట్టాలని ఎన్ని అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుచేసిన ఇంకా గ్రామాలలో బాల్య వివాహాలు జరుగుచున్నాయని, వాటిని అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆమె పేర్కొన్నారు. బాల్య వివాహాల వలన చిన్న వయసులో గర్భం దాల్చిన వచ్చే పరిణామాల గురించి సంఘ సభ్యులకు తెలియజేశారు. అలాగే అంగన్వాడీ కేంద్రాలలో ఉండే పిల్లలు వయసుకు తగ్గ ఎత్తు బరువు ఉండాలని పిల్లలకు మంచి పోషక విలువలు ఉన్న సమతుల ఆహారాన్ని అందించాలని అంగన్వాడీ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ శ్రీదేవి సూపర్వైజర్ రమాదేవి, ఏపిఎం సురేఖ, సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సిడిపిఓ శ్రీదేవి

## చాంద్ సాఫ్ట్‌వేర్ ప్రాజెక్టులకు సహకారం..

**చాంద్ హాఫీజ్ నవాజ్‌ను అభినందించిన ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి..**

**తాడిపత్రి (తెలుగోడు), మార్చి 25:**
యువతలో ఉన్న ప్రతిభను ప్రోత్సహించడం ద్వారా దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని, భవిష్యత్తులో చాంద్ హాఫీజ్ నవాజ్ చేపట్టే సాఫ్ట్‌వేర్ ప్రాజెక్టులకు తన వంతు సహకారం అందిస్తానని తాడిపత్రి శాసనసభ్యులు జేసీ అస్మిత్‌రెడ్డి హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం చాంద్ హాఫీజ్ నవాజ్‌ను ఆహ్వానించి, సాధించిన విజయాలకు ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా చాంద్ హాఫీజ్ నవాజ్ తన విద్యాభ్యాసంతో పాటు ఇప్పటి వరకు చేసిన సాంకేతిక సేవలను ఎమ్మెల్యేకి వివరించారు. డెన్ బీ, బీన్ లీ, బొటానిక వంటి ప్రముఖ సంస్థలకు సెక్యూరిటీ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్స్ అందించడంతో పాటు, ఇండియన్ మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్‌కు కూడా సేవలను అందించినట్లు తెలిపారు. ఈ కృషికి గుర్తింపుగా షీల్డ్ అందించిన విషయాన్ని వివరించారు. జిల్లా సైన్స్ సెంటర్‌కు వెబ్ సైట్, ఆండ్రాయిడ్ యాప్ ఉచితంగా రూపొందించానని తెలిపారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి మాట్లాడుతూ బీటెక్ చదువుతున్న దశలోనే స్టార్టప్ ప్రారంభించాలని, లక్ష్యాన్ని ముందుగానే నిర్ణయించుకుని, దానిని సాధించడానికి కృషి చేయాలని సూచించారు. టెక్నాలజీ రంగంలో ముందుకు రావాలనుకునే చాంద్ హాఫీజ్ నవాజ్‌కు తాను ఎప్పుడూ అండగా ఉంటానని, అవసరమైన మార్గదర్శకత్వం, అవకాశాలు కల్పిస్తానని తెలిపారు. చాంద్ హాఫీజ్ నవాజ్ వంటి ప్రతిభ కలిగిన యువకులు తాడిపత్రికి గర్వకారణమని పేర్కొంటూ, భవిష్యత్తులో చాంద్ హాఫీజ్ నవాజ్ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా, సాఫ్ట్‌వేర్, సైబర్ సెక్యూరిటీ రంగాలలో మరింతగా ఎదిగి దేశానికి సేవ చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు.


తాను చేసిన సాంకేతిక సేవలను ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డికి వివరిస్తున్న చాంద్ హాఫీజ్ నవాజ్


చాంద్ హాఫీజ్ నవాజ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి


విద్యార్థినుల భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి

## కేబీవీకేలో మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలన

**ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి ..**

**తాడిపత్రి (తెలుగోడు), మార్చి 25:**
స్థానిక అంజనేయమాన్యంలో ఉన్న కేబీవీకే బాలికల కళాశాలలో బుధవారం శాసనసభ్యులు జేసీ అస్మిత్ రెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కళాశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి, విద్యార్థినులతో భోజనం రుచి గురించి అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో భోజనం వండే కిచెన్, స్టోర్ రూములు పరిశీలించారు. తాజా కాయగూరలు వాడాలని , పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా బాలికల వసతి గృహాన్ని కూడా సందర్శించిన ఎమ్మెల్యే హాస్టల్‌లో వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు.


ప్రమాదంలో కాలు విరిగిన ప్రసాద్

## కారు ద్విచక్ర వాహనం ఢీ ఒకరికి గాయాలు

**యాడికి (తెలుగోడు), మార్చి 25:**
పెద్దవడుగూరు మండల పరిధిలోని కిష్టపాడు గ్రామం సమీపంలో బుధవారం కారు ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో ప్రసాద్ కి తీవ్ర గాయాలయ్యాయి. రాయలచెరువు గ్రామానికి చెందిన కుమ్మర ఫక్కీరప్ప కుమారుడు ప్రసాద్ ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా కారు తగలడంతో కిందపడ్డాడు. చికిత్స కోసం అనంతపురం తరలించారు. సంఘటన స్థలానికి పెద్దవడుగూరు పోలీసులు వచ్చి పరిశీలించి విచారణ జరిపారు.


అధికారులు పట్టుకున్న ఇళ్లలో ఉపయోగించే చిన్న సిలిండర్లు

## గ్యాస్ సిలిండర్లు పట్టివేత

**యాడికి (తెలుగోడు), మార్చి 25:**
యాడికి మండల కేంద్రంలో గ్యాస్ సమస్య అధికంగా ఉండడంతో బుధవారం తహసిల్దార్ ప్రతాపరెడ్డి ఆదేశాల ప్రకారం సిఎస్‌డిటి మల్లేష్, ఆర్ఐ కిష్టప్ప వీఆర్వోలు హోటల్లు. డాబాలు. పాన్ పూరి బండ్లలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఐదు సిలిండర్లు స్వాధీనం చేసుకుని తహసిల్దార్ కార్యాలయానికి తరలించారు. హోటళ్లు, షాపుల్లో వాణిజ్య సిలిండర్లు వాడకుండా గృహవినియోగ సిలిండర్లు వాడడం వల్ల ప్రజలకు అందాల్సిన గ్యాస్ సిలిండర్లు పక్కదారి పడుతున్నాయని అన్నారు. గ్యాస్ ఏజెంట్లు హోటళ్లకు టీ స్టాల్‌లో బ్లాక్‌లో వీటిని అమ్ముతున్నారని అన్నారు.

## కోనఉప్పలపాడులో బాలుడి కిడ్నాప్

**పోలీసులు గాలింపు..**

**యాడికి (తెలుగోడు), మార్చి 25:**
యాడికి మండల పరిధిలోని కొనుప్పలపాడు గ్రామానికి చెందిన బోయ హేమ చంద్ర(5) బుధవారం గుర్తు తెలియని వృత్తి ద్విచక్ర వాహనంలో కిడ్నాప్ చేశారని కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. కోన ఉప్పలపాడు గ్రామానికి చెందిన బోయ గోవిందు, కాంతమ్మ దంపతుల కుమారుడు హేమచంద్ర యాడికి మండల కేంద్రంలోని వాగ్దేవి స్కూల్‌లో చదువుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో స్కూల్ నుండి స్కూల్ బస్సులో కొనుప్పలపాడు గ్రామానికి వచ్చాడు. ఇంటి వద్ద స్కూల్ బ్యాగ్ పెట్టి గ్రామంలోని ట్యాంక్ వద్దకి రాగా అక్కడ ఒక గుర్తుతెలియని వ్యక్తి ముఖానికి మాస్క్ పెట్టుకొని బైక్‌లో హేమచంద్రను ఎక్కించుకొని వెళ్ళిపోయాడని సమాచారం. బైక్ నిలపెట్టిన ఫొలోలు కిరాణా షాపులో ఉన్న సిసి కెమెరాలో రికార్డ్ అయ్యాయి. బాలుడు తండ్రి యాడికి పోలీసులకి ఫోన్ లో ఫిర్యాదు చేశారు. వెంటనే యాడికి సీఐ శ్రీనివాసులు కోన ఉప్పలపాడు గ్రామానికి వెళ్లి సీసీ కెమెరా పుటేజీటు పరిశీలించారు. పూర్తి సాయిలో విచారణ చేపడుతున్నారు.


హేమచంద్ర



వంట సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్‌డిఓ ఆనంద్ కుమార్

# అంబేద్కర్ గురుకుల పాఠశాల తనిఖీ

### విద్యార్థులకు గుణాత్మకమైన విద్యాబోధన .. ఆర్డిఓ ఆనంద్ కుమార్ ..

**రొళ్ల (తెలుగోడు), మార్చి 25 :**
మండలంలోని దొమ్మరహట్టి సమీపంలో ఉనన అంబేద్కర్ గురుకుల పాఠశాలను బుధవారం ఆర్డిఓ ఆనంద్ కుమార్ తనిఖీ చేశారు. పాఠశాలలో గ్యాస్ కొరత పై ప్రిన్సిపల్ మైలారప్పను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలోని వంటగదిని పరిశీలించారు. పాఠశాలలో 877 మంది విద్యార్థులు ఉండగా.. ఇక్కడ వంట చేయడానికి 8 మంది వంట సిబ్బంది అవసరం ఉందని ఆరుగురు మాత్రమే వంట సిబ్బంది ఉండారని ఆర్టీవో దృష్టికి ప్రిన్సిపల్ మైలారప్ప తీసుకెళ్లారు. విద్యార్థులకు గుణాత్మకమైన విద్యాను అందించాలని సూచించారు. ఆర్ డి ఓ వెంట తహాసిల్దార్ చంద్రశేఖర్ ఉన్నారు.



గ్యాస్ సిలిండర్‌ల వివరాలు తెలుసుకొంటున్న ఆర్‌డిఓ ఆనంద్ కుమార్

# సీఎం చంద్రబాబుతోనే అన్ని ప్రాంతాల అభివృద్ధి సాధ్యం

### ఎమ్మెల్యే పరిటాల సునీత..

**అనంతపురం రూరల్ (తెలుగోడు), మార్చి 25 :**
ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే అన్ని ప్రాంతాల అభివృద్ధి సాధ్యమని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ మిట్టల్ - నిప్పాన్ స్టీల్ సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్న భారీ స్టీల్ ప్లాంట్ కు శంకుస్థాపన జరగడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే ప్రఖాత సంస్థలు ఏపీకి రావడం.. ఇక్కడి పారిశ్రామిక ప్రగతిని సూచిస్తోందని ఆమె అభిప్రాయపడ్డారు. దేశంలోనే అతిపెద్ద గ్రీన్ ఫీల్డ్ స్టీల్ ప్రాజెక్టులలో ఒకటైన ఈ ప్రాజెక్ట్ సుమారు రూ.1,35,964 కోట్లకు పైగా పెట్టుబడితో అతిపెద్ద ఉక్కు కర్మాగారాన్ని నిర్మించబోతుండటం రాష్ట్రానికే గర్వ కారణమన్నారు. దీని వలన లక్షకు పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ అవకాశాలు వచ్చే అవకాశం ఉందన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్రలో యువతకు భారీ స్థాయిలో ఉపాధి లభిస్తుందన్నారు. ఈ ప్రాజెక్టు రాకతో ఉత్తరాంధ్ర ఇండస్ట్రియల్ హబ్ గా అభివృద్ధి చెందుతోంది. పోర్ట్ కనెక్టివిటీ, రహదారి, రైల్వే సదుపాయాలు మెరుగుపడి లాజిస్టిక్స్ రంగం బలోపేతం అవుతుందన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

### ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు ఆధ్వర్యంలో

# మడకశిరలో కృతజ్ఞతా ర్యాలీ

### ఆర్డీటీకి ఎఫ్.సీ.ఆర్.ఏ రెన్యూవల్ అయిన సందర్భంగా భారీ ర్యాలీ.. చంద్రబాబు,పవన్ కళ్యాణ్,లోకేష్ చిత్ర పటాలకుపాలాభిషేకం..

**మడకశిర/అగళి (తెలుగోడు), మార్చి 25 :**
రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్(ఆర్డీటీ)కి ఎఫ్.సీ.ఆర్.ఏ రెన్యూవల్ చేసేవిధంగా ప్రత్యేక కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, యువమంత్రివర్యులు నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ మడకశిర శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు,శ్రీసత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షులు ఎం.ఎస్.రాజు ఆధ్వర్యంలో మడకశిర పట్టణంలో భారీ కృతజ్ఞతా ర్యాలీ బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సారథ్యంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఈ ర్యాలీలో పాల్గొన్నారు."థ్యాంక్యూ సీఎం చంద్రబాబుగారు", "థ్యాంక్యూ నారా లోకేష్ అన్న" అంటూ ప్లకార్డులు చేతబట్టి మడకశిర పురవీధుల్లో కాలినడకన ర్యాలీ చేపట్టారు. మడకశిర పట్టణంలోని వాల్మీకి సర్కిల్ నుండి మహాత్మా జ్యోతిబాపూలే సర్కిల్ వరకు ర్యాలీ జరిగింది.ఈ సందర్భంగా ఎం.ఎస్.రాజు మాట్లాడుతూ యువమంత్రివర్యులు నారా లోకేష్ యువగళం పాదయాత్ర నిర్వహించినప్పుడు అనంతపురం వచ్చిన సందర్భంలో ఆర్డీటీ సంస్థను పరిశీలించారన్నారు. ఆర్డీటీ ఎదుర్కొంటున్న సమస్యలను సంస్థ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారన్నారు. ప్రభుత్వం వచ్చిన వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకి ఉమ్మడి అనంతపురం టీడీపీ ఎమ్మెల్యేలంతా పలుమార్లు విజ్ఞప్తి పత్రాలు ఇవ్వడం, అసెంబ్లీలో సమస్యపై చర్చించడం వంటి చర్యలు తీసుకున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, యువమంత్రి నారా లోకేష్ ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, కేంద్ర ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి కేవలం 20 నెలల వ్యవధిలోనే ఆర్డీటీ సంస్థకు ఎఫ్.సీ.ఆర్.ఏ రెన్యూవల్ సమస్య పరిష్కరించారన్నారు.
దాదాపు 2022 నుండి ఈ సమస్యతో ఆర్డీటీ ఇబ్బందిపడుతుంటే జగన్మోహన్ రెడ్డి ఒక్కసారి కూడా పరిష్కారంపై దృష్టి పెట్టలేదన్నారు. కానీ నేడు కూటమి ప్రభుత్వం సమస్యను పరిష్కరించిన తర్వాత క్రెడిట్ చోరీకి పాల్పడే ప్రయత్నాలు చేయడం నిజంగా సిగ్గుచేటు అన్నారు. జగన్మోహన్ రెడ్డికి ఎదుటి వారి ఆస్తులను, చివరకు కుటుంబ సభ్యుల ఆస్తులను దోచుకునే అలవాటు ఒక్కటే కాదు చివరకు క్రెడిట్ కూడా దోచుకునే అలవాటు ఉందని వైసీపీ నేతలు స్పష్టం చేస్తున్నారన్నారు. వైసీపీ పాలనతో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని, పూర్తిగా నష్టపోయాం అన్నారు. చివరకు ఆర్డీటీ లాంటి స్వచ్ఛంద సంస్థలు కూడా నష్టపోయాయని ఇబ్బందుల్లోకి నెట్టబడ్డాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, యువమంత్రి నారా లోకేష్‌కు ఆర్డీటీ సంస్థ తరపున, ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజల తరపున కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఆర్టీటీకి ఎప్పుడూ ఇదేవిధంగా అండగా ఉండాలని కోరుతున్నామని ఎం.ఎస్.రాజు అన్నారు. ఆర్డీటీ సంస్థకు కూటమి ప్రభుత్వం ఉన్నంత కాలం ఎలాంటి ఇబ్బంది ఉండదని రుజువైందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు ఈ సందర్భంగా పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్రకార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ,మాజీ మున్సిపల్ చైర్మన్ నరసింహరాజా, మాజీ వైస్ చైర్మన్ ప్రభావతి, ఏపీఐఐసీ డైరెక్టర్ రోళ్లకొండ రామకృష్ణ, ఐదు మండలాల కన్వీనర్లు,సింగిల్ విండో ప్రెసిడెంట్లు, క్లస్టర్, యూనిట్,బూత్ ఇన్చార్జులు, మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



కృతజ్ఞతార్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తదితరులు



కేక్ కట్ చేసి తినిపిస్తున్న ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి




సమావేశంలో మాట్లాడుతున్నా రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మి నారాయణ

# సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ కృషి ఫలితమే ఆర్‌డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరణ

### రాష్ట్ర కుంచిటిగ వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ..

**రొళ్ల (తెలుగోడు), మార్చి 25 :**
ఆర్‌డీటీ స్వచ్ఛంద సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరణ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , మంత్రి నారా లోకేష్, కృషి ఫలితమేనని రాష్ట్ర కుంచిటిగ వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాయలసీమతో పాటు పలు ప్రాంతాల్లో ఆర్‌డీటీ సంస్థ నాలుగు దశాబ్దాలుగా విద్య, వైద్యం, క్రీడలు, దివ్యాంగుల అభ్యున్నతి, గృహనిర్మాణం, రైతుల అభివృద్ధి వంటి రంగాల్లో విశేష సేవలు అందించిందన్నారు. ఎఫ్‌సీఆర్‌ఏ రీన్యువల్ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు పలుమార్లు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కు లేఖలు రాశారని, మంత్రి నారా లోకేష్ కేంద్రమంత్రి అమిత్ షాను కలిసి వివరించారని చెప్పారు. వారి కృషి ఫలితంగానే కేంద్రం ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరణకు ఆమోదం తెలిపిందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ కు కేంద్ర, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఎఫ్‌సీఆర్‌ఏ రద్దైన సమయంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రేన్యువల్ కోసం ప్రయత్నించలేదని విమర్శించారు. ప్రస్తుతం ఆ క్రెడిట్ తమదేనని చెప్పడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు.ఆర్‌డీటీ సేవల కొనసాగింపుకు ఎవరు కృషి చేశారో ప్రజలకు బాగా తెలుసని లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు.



గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్ డి ఓ ఆనంద్ కుమార్

# రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడండి

### ఆర్ డి ఓ ఆనంద్ కుమార్ ..

**రొళ్ల (తెలుగోడు), మార్చి 25 :**
మడకశిర రెవెన్యూ డివిజనల్ అధికారి ఆనంద్ కుమార్ మండలంలోని తుబినకుంట గ్రామంలో ప్రతిపాదిత పట్టాదార్ పాస్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం దృష్ట్యా నిర్వహించిన గ్రామ సభకు హాజరయ్యారు. గ్రామ సభ సందర్భంగా రైతులు తమ పట్టాదార్ పాస్‌బుక్స్‌కు సంబంధించిన పలు సమస్యలను ఆర్ డి ఓ దృష్టికి తీసుకువచ్చారు. ఆర్ డి ఓ వారి సమస్యలను ఓపికగా విని, పంపిణీ ప్రక్రియను వివరంగా తెలియజేశారు. అలాగే రైతుల పేరు, సర్వే నంబర్, భూభాగం విస్తీర్ణం, ఫోటో ఇతర సంబంధిత వివరాల ఆధారంగా డ్రాఫ్ట్ పిపిబి ఎస్ ను పరిశీలించారు. తహసీల్దార్, చంద్రశేఖర్, వీఆర్వో లు గ్రామ సర్వేయర్లు గ్రామ సభకు హాజరయ్యారు. ఈ కెవైసి ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆర్ డి ఓ సిబ్బందికి ఆదేశించారు. రైతుల సందేహాలు సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడంలో ఆర్ డి ఓ మార్గదర్శకత్వం ఎంతో ఉపయోగపడింది.

# శుభకార్యంలో పాల్గొన్న జనసేన నాయకులు

**రొళ్ల (తెలుగోడు), మార్చి 25 :**
మండలంలోని జి యన్ పాళ్యం గ్రామానికి చెందిన జనసైనికుడు సుకేష్ భార్య సీమంతం కార్యక్రమానికి మండల జనసేన నాయకులు పాల్గొన్నారు.మడకశిర నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త టి రంగస్వామి రొళ్ళ మండలం ఉపాధ్యక్షులు గోపి, రాఘవేంద్ర, బసవరాజు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మండల నాయకులను సుకేష్ శాలువా తో ఘనంగా సత్కరించారు.



వేడుకల్లో పాల్గొన్న జనసేన నాయకులు



మండల నాయకులను సన్మానిస్తున్న సుకేష్

# మంత్రి లోకేష్‌ను కలిసిన క్లస్టర్ ఇంచార్జ్ దండే రవి

# నంబులపూలకుంటలో పరిశ్రమలు ఏర్పాటుచేయాలి

**నంబులపూలకుంట (తెలుగోడు), మార్చి 25 :**
ఎన్పీకుంట మండల అభివృద్ధికి పరిశ్రమల స్థాపన అత్యవసరమని క్లస్టర్ ఇంచార్జ్ దండే రవి రాష్ట్ర మంత్రి లోకేష్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. విజయవాడలో జరిగిన క్లస్టర్ ఇంచార్జిల సమావేశంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ అంశాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మండలంలో స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నప్పటికీ, ఉపాధి అవకాశాల కొరత తీవ్ర సమస్యగా మారిందని రవి వివరించారు. కృష్ణా జలాల ద్వారా చెరువులు నిండినప్పటికీ, వ్యవసాయంలో ఇటీవల వచ్చిన మార్పులతో రైతులకు నిరంతర ఉపాధి లభించడం లేదని తెలిపారు. ఇటీవల మండలంలో 1000 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ హబ్ ఏర్పడినా, స్థానికులకు ఆశించిన స్థాయిలో ఉపాధి అవకాశాలు లభించడం లేదని పేర్కొన్నారు. ఉపాధి లేకపోవడంతో అనేక కుటుంబాలు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ముఖ్యంగా యువత పట్టణాలకు తరలిపోతుండటంతో గ్రామీణ ప్రాంతాల్లో జనాభా తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలను మండలంలో ఏర్పాటు చేయాలని దండే రవి కోరారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు ప్రాధాన్యత ఇస్తే రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని, మహిళలకు కూడా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని సూచించారు. స్థానిక వనరులను వినియోగించే పరిశ్రమలు వస్తే ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని వివరించారు. అలాగే యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందించాల్సిన అవసరం ఉందని, దీనివల్ల పరిశ్రమల్లో ఉద్యోగాలకు సిద్ధమవుతారని పేర్కొన్నారు. వలస వెళ్లిన ప్రజలను తిరిగి గ్రామాలకు రప్పించేందుకు పరిశ్రమలే శాశ్వత పరిష్కారమని అభిప్రాయపడ్డారు. మంత్రి లోకేష్ ఈ విషయాన్ని సానుకూలంగా పరిశీలిస్తానని హామీ ఇచ్చినట్లు సమాచారం. త్వరలోనే సంబంధిత అధికారులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకునే అవకాశముందని తెలుస్తోంది.
మొత్తంగా పరిశ్రమల ఏర్పాటు ద్వారా నంబులపూలకుంట మండలంలో ఉపాధి అవకాశాలు పెరిగి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మంత్రి నారా లోకేష్‌తో దండే రవి

# రీ సర్వే తప్పులు సరిదిద్దేందుకే గ్రామసభ

### ఆర్ డి ఓ ఆనంద్ కుమార్..

**అగళి (తెలుగోడు), మార్చి 25 :**
రీ సర్వేలో తప్పులు సరిదిద్దేందుకే గ్రామసభ నిర్వహించామని ఆర్ డి ఓ ఆనంద్ కుమార్ పేర్కొన్నారు.మండల పరిధిలోని ఏ కేడీ హళ్లి గ్రామంలో ఏడాది నుంచి నిర్వహించిన రీసర్వే కార్యక్రమం పూర్తి అయిన నేపథ్యంలో మడకశిర ఇన్చార్జ్ రెవెన్యూ డివిజనల్ అధికారి టి ఆనంద్ కుమార్,దొక్కలపల్లి గ్రామానికి వచ్చి ఆ గ్రామంలోని మారమ్మ దేవాలయం ఆవరణంలో రైతులతో సమావేశమై, వివిధ అంశాలపై రైతులతో సమీక్ష నిర్వహించారు, ముఖ్యంగా పట్టా నంబరు,1బి నెంబరు, ఆధార్ నెంబరు, సక్రమంగా లేని ఎడల పాస్ పుస్తకం రావడానికి ఇబ్బందిగా ఉంటుందని కావున ఏవైనా తప్పులు ఉన్నట్లయితే వెంటనే సరి చేసుకోవాలని రైతులకు సూచించారు, సాగులో ఉన్న ప్రతి ఒక్క రైతుకు పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఒక కుటుంబంలో భూ యజమాని ఎవరైనా మరణిస్తే వారి వారసులకు పట్టదార్ పాస్ పుస్తకాలు మంజూరు చేయడం జరుగుతుందని ఒకరి కంటే ఎక్కువ మంది ఉన్నట్లయితే వారు నూరు రూపాయల తో మడకశిర సబ్ రిజిస్టర్ కార్యాలయానికి వెళ్లి రిజిస్టర్ చేసుకున్నట్లైతే వారికి సైతం పాస్ పుస్తకాలు వస్తాయని ఇంతకుముందులా ఎవరి ఫోటోలు ఉండవని రాజముద్రతో పట్టాదార్ పాస్ పుస్తకాలు వస్తాయని అందులో క్యూఆర్ కోడ్ ఉంటుందన్నారు.క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేస్తే వివరాలు వెల్లడవుతాయని ఈ సందర్భంగా ఆర్డీవో ఆనంద్ కుమార్ తెలిపారు, ఈ మేరకు పలువురు రైతులు భూమి కొలతలలోను అన్నదమ్ముల విభాగాలలో వచ్చిన తేడాలను ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లగా సమస్యను పరిశీలించి న్యాయం చేయాలని తహసిల్దార్ సుబ్బారావుకు తెలిపారు.అనంతరం సర్వే పూర్తి చేసుకున్న రైతులకు వన్ బి అడంగల్ పంపిణీ చేశారు,ఈ కార్యక్రమం లో తాసిల్దార్ సుబ్బారావు,ఆర్ఐ చంద్రశేఖర్ రావు, డిప్యూటీ ఎంపీడీవో రెడ్డి ప్రకాష్, విఆర్ఓ సూర్య ప్రకాష్, మండల సర్వేయర్ మారుతి విలేజ్ సర్వేయర్ లిఖిత్, వీఆర్ఏ మంజునాథ్, రైతులు పాల్గొన్నారు.



రైతుకు పట్టా పంపిణీ చేస్తున్న ఆర్డీవో ఆనంద్ కుమార్



గ్రామ సభలో పాల్గొన్న రైతులు

# గ్యాస్ కొరత సాకుతో అదనపు చార్జీలు వసూలు చేస్తే చర్యలు

### సాయి దత్త ఇండేన్ గ్యాస్ గోడౌన్ ఆకస్మిక తనిఖీ.. ఆర్డిఓ టి.ఆనంద్ కుమార్..

**అగళి (తెలుగోడు), మార్చి 25 :**
మండల కేంద్రానికి సమీపంలోని ఎం ఎం పాళ్యం గ్రామం వద్ద ఉన్న సాయి దత్త ఇండేన్ గ్రామీణ వితారక్ గ్యాస్ గోడౌన్‌ను మడకశిర డివిజన్ ఇంచార్జ్ ఆర్డీవో టి.ఆనంద్ కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ఎల్పిజి సిలిండర్లు నిల్వల పరిస్థితి పంపిణీ ప్రక్రియను సమీక్షించేందుకు ఈ తనిఖీ చేపడుతున్నాం అని అన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో గోదాములో నిర్వహిస్తున్న స్టాక్ రిజిస్టర్స్ ను ఇతర రికార్డులను సమగ్రంగా పరిశీలించారు. ఏజెన్సీలో గత 15 రోజుల నుంచి ఎన్ని బుకింగ్ లు,డెలివరీలు జరిగాయి,బ్యాక్లాగ్ ల గురించి ఆర్డీవో అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వినియోగదారులకు ఆలస్యం చేయకుండా ఎటువంటి ఇబ్బంది లేకుండా గ్యాస్ సరఫరాను సజావుగా చేపట్టాలని సూచించారు. నిబంధనలను కచ్చితంగా పాటించాలని అన్నారు, డిమాండును అడ్డుపెట్టుకొని అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అన్నారు.ఈ కార్యక్రమం లో ఆర్డీవో ఆనంద్ కుమార్ వెంట తహసిల్దార్ సుబ్బారావు, ఆర్ ఐ చంద్రశేఖర రావు, డిప్యూటీ ఎంపీడీవో రెడ్డి ప్రకాష్,వీఆర్వో సూర్యప్రకాష్,మండల సర్వేయర్ మారుతి, విలేజ్ సర్వేయర్ లిఖిత్, వీఆర్ఏ మంజునాథ్, పాల్గొన్నారు. తనిఖీ సమయంలో గ్యాస్ నిర్వహకుడు అశోక్,తన తండ్రి గ్యాస్ సరఫరా సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




స్టాక్ రిజిస్టర్‌లను బోర్డులను పరిశీలిస్తున్న ఆర్డిఓ టి ఆనంద్ కుమార్



స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఆర్డిఓ టి ఆనంద్ కుమార్



కోసిగి ఎక్సైజ్ స్టేషన్‌లో ట్రైనీ ఎస్ఐగా ధనుంజయ రిపోర్ట్ చేస్తున్న దృశ్యం

## కోసిగి ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ ట్రైనీ ఎస్ఐగా ధనుంజయ బాధ్యతల స్వీకరణ

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 25 :**
గ్రూప్ – 2 నియామకాల ద్వారా ఎంపికైన ట్రైనీ ప్రొహిబిషన్ , ఎక్సైజ్ సబ్‌ఇన్స్పెక్టర్ ఎస్. ధనుంజయ బుధవారం కోసిగి ప్రొహిబిషన్ & ఎక్సైజ్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించి శిక్షణను ప్రారంభించారు. కర్నూలు జిల్లాలోని పెద్దకడుబూరు గ్రామానికి చెందిన ధనుంజయ తన ట్రైనింగ్ నిమిత్తం కోసిగి ఎక్సైజ్ స్టేషన్‌లో అధికారికంగా రిపోర్ట్ చేసుకున్నారు. ఈ సందర్భంగా కోసిగి ప్రొహిబిషన్ & ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ పి. భార్గవ రెడ్డి ట్రైనీ సబ్‌ఇన్స్పెక్టర్ ధనుంజయను అభినందించారు. శిక్షణ కాలాన్ని సద్వినియోగం చేసుకొని శాఖ నియమ నిబంధనలను పూర్తిగా అవగాహన చేసుకోవాలని సూచించారు. విధుల్లో సత్ప్రవర్తన, అంకితభావం, క్రమశిక్షణతో పనిచేస్తూ ప్రజలకు సేవ చేయాలనే దృఢసంకల్పంతో ముందుకు సాగితే భవిష్యత్తులో మంచి పేరు సంపాదించగలరని ఆయన అన్నారు. శిక్షణ కాలంలో సీనియర్ అధికారుల సూచనలు పాటిస్తూ శాఖ పనితీరును సమగ్రంగా నేర్చుకోవాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం ద్వారా పోలీసు వ్యవస్థపై నమ్మకం పెంపొందించాలన్నారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది ట్రైనీ సబ్‌ఇన్స్పెక్టర్ ధనుంజయకు శుభాకాంక్షలు తెలిపారు. పెద్దకడుబూరు గ్రామానికి చెందిన యువకుడు ఎక్సైజ్ శాఖలో సబ్‌ఇన్స్పెక్టర్‌గా ఎంపిక కావడం స్థానిక ప్రజల్లో ఆనందాన్ని కలిగించింది. గ్రామ ప్రజలు, స్నేహితులు ఆయనకు అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.



పెద్దకడబూరు ఏపీ మోడల్ స్కూల్ , జూనియర్ కళాశాల

## ఇంటర్ ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోండి

ప్రిన్సిపాల్ ఆర్వీ రాఘవేంద్ర ..

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 25 :**
పెద్దకడబూరు గ్రామంలోని ఆదర్శ పాఠశాల జూనియర్ కళాశాలలో 2026 – 27 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం విద్యార్థుల నుండి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఆర్వీ రాఘవేంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రవేశాలు ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులలో అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ఈ నెల 18, నుండి ప్రారంభమై ఏప్రిల్ వరకు కొనసాగుతాయన్నారు. దరఖాస్తు రుసుం ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ. 200, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.150 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రవేశాలు పదో తరగతి మార్కుల మెరిట్ ఆధారంగా, ప్రభుత్వ రిజర్వేషన్ నిబంధనల ప్రకారం ఇవ్వబడతాయని, ఎలాంటి ప్రవేశ పరీక్ష ఉండదని స్పష్టం చేశారు. విద్యార్థులు మరిన్ని వివరాల కోసం http://apms.apcfss.i, http://cse.ap.gov.in వెబ్‌సైట్లను సందర్శించవచ్చని పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం ఆదర్శ పాఠశాల జూనియర్ కళాశాల, ప్రిన్సిపాల్ 9705555735 మొబైల్ నెంబర్ ను సంప్రదించాలని కోరారు.

# రైతన్న సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### రైతులకు అండ
### పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ ..
### 'రైతన్న కోసం' కార్యక్రమంలో
### టీడీపీ ఇన్‌చార్జ్ రాఘువేంద్ర రెడ్డి..

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 25 :**
రైతాంగ అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జ్ రాఘవేంద్ర రెడ్డి పేర్కొన్నారు. రైతుల ఆదాయం పెంచే దిశగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఆయన అన్నారు. బుధవారం పెద్దకడబూరు మండల పరిధిలోని రంగాపురం గ్రామంలో వ్యవసాయ అధికారిణి సుచరిత ఆధ్వర్యంలో నిర్వహించిన "రైతన్న కోసం" కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా టీడీపీ ఇన్ చార్జ్ రాఘవేంద్ర రెడ్డి, టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు బసలదొడ్డి ఈరన్న, టీడీపీ మండల అధ్యక్షులు గవిగట్టు మల్లికార్జున, సొసైటీ ఛైర్మన్లు కందనాతి నరసప్ప, తలారి మీ సేవ ఆంజనేయులు, ఆర్టీఎస్ తాలూకా కన్వీనర్ దశరథ రాముడు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మొట్రు రామాంజనేయులు, టీడీపీ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ గోనుమాను నరసన్న, టీడీపీ మండల ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, బూత్ యూనిట్ ఇన్ చార్జ్ తలారి అంజీ, గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి రైతులతో ముచ్చటించి ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించారు. ముఖ్యంగా పీఎం కిసాన్ -- అన్నదాత సుఖీభవ



పీఎం కిసాన్ – అన్నదాత సుఖీభవ పథకం గురించి వివరిస్తున్న టీడీపీ నేతలు



వృద్ధ రైతుతో మాట్లాడుతున్న టీడీపీ ఇన్ చార్జ్ రాఘవేంద్ర రెడ్డి

పథకం ద్వారా రైతులకు అందుతున్న ప్రయోజనాలను వివరించారు. ఈ పథకం కింద ప్రతి రైతుకు సంవత్సరానికి రూ.20 వేల పెట్టుబడి సాయం అందజేస్తూ ఎన్నికల సమయంలో రైతాంగానికి ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నెరవేర్చారని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడానికి గ్లోబల్ ఉద్యాన హబ్ ఏర్పాటు, 90 శాతం సబ్సిడీతో బిందు సేద్యం, ఉద్యాన రైతులకు 'ఉజ్వల భవిత' పథకం, 'పొలం పిలుస్తోంది', 'ప్రకృతి అందాలు వ్యవసాయం' వంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.
అదేవిధంగా వ్యవసాయ యాంత్రీకరణకు ప్రోత్సాహం అందించడం, ఆయిల్ పామ్ సాగును విస్తరించడం ద్వారా రైతుల ఆదాయం పెంచే చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. నల్లబర్లీ పొగాకు రైతులకు ప్రత్యేకంగా చేయూత అందిస్తున్నామని తెలిపారు. అలాగే ఉల్లి, మామిడి, కోకో పంటలు సాగు చేసే రైతులకు కూడా ప్రభుత్వం అండగా నిలుస్తోందని వివరించారు.
రైతులు ఆధునిక పద్ధతులను అవలంబించి వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చుకోవాలని నాయకులు సూచించారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను పూర్తిగా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోసిగి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కలుగొట్ల లక్ష్మన్న, టీడీపీ గ్రామ అధ్యక్షులు మహదేవ, సాగునీటి సంఘం అధ్యక్షులు సత్యన్న గౌడ్, టీడీపీ నాయకులు కల్లు లక్ష్మన్న, నరసయ్య, మొట్రు కుంటి ఈరన్న, మొట్రు నరసింహులు, చిన్నతుంబళం గ్రామ టీడీపీ అధ్యక్షులు నరసింహులు, హెచ్ మురవణి గ్రామ టీడీపీ అధ్యక్షులు బోయ సొంటెన్న, జనార్దన్, దుమ్మల శివ, గవిగట్టు ఉప్పర మునిస్వామి, సొసైటీ డైరెక్టర్ సంజీవయ్య, మేకడోణ రాఘవరెడ్డి, ఖాజా, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



రంగాపురంలో రైతన్న కోసం కార్యక్రమంలో రైతు సంక్షేమ పథకాలు గురించి వివరిస్తున్న దృశ్యం



## నేడు సుండుపల్లెకు రానున్న హైకోర్టు జస్టిస్ బాలాజీ

కుటుంబ కార్యక్రమంలో పాల్గొననున్న హైకోర్టు న్యాయమూర్తి

**టీ సుండుపల్లి (తెలుగోడు), మార్చి 25 :**
సుండుపల్లె మండలం తిమ్మసముద్రం గ్రామానికి గురువారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తి మేడిమల్లి బాలాజీ కుటుంబ పర్యటన నిమిత్తం వస్తున్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. సాధారణ స్థాయి నుంచి ఆంధ్రప్రదేశ్ అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా ఎదిగిన మేడిమల్లి బాలాజీ ప్రస్థానం ఆదర్శనీయమని, ఈ సందర్భంగా తిమ్మసముద్రం గ్రామస్తుల సమక్షంలో హైకోర్టు అదనపు న్యాయమూర్తి మేడిమల్లి బాలాజీకి అభినందన సభ ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.



## అమిత్ షా తో వేమిరెడ్డి దంపతుల భేటీ

**నెల్లూరు, మార్చి 25:**
నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఢిల్లీలోని హోం మంత్రిత్వ శాఖ కార్యాలయంలో కేంద్ర హోం మంత్రి అమీత్ షాని కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి.. వేమిరెడ్డి దంపతులను ఆప్యాయంగా పలకరించారు. పెన్నా నది కరకట్టల బలోపేతం మరియు చారిత్రక పినాకిని సత్యాగ్రహ ఆశ్రమ పరిరక్షణకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర నివేదిక అందచేశారు. ఇందుకూరు పేట మండలంలోని దక్షిణ భారత సబర్మతిగా పేరుగాంచిన చారిత్రక పల్లిపాడు పినాకిని సత్యాగ్రహ ఆశ్రమం సుమారు ఏడున్నర ఎకరాల మేర పెన్నానది కోతకు గురి కావడంతో గాంధీ ఆశ్రమం ఉనికికే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని వేమిరెడ్డి దంపతులు తెలిపారు.

## వ్యవసాయంలో గ్లోబల్ కనెక్ట్..

సింగపూర్‌తో ఏపీ చర్చలు

**అమరావతి/ విజయవాడ, మార్చి 25:**
రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సింగపూర్ దేశ ప్రతినిధులతో బుధవారం విజయవాడ క్యాంప్ కార్యాలయం నుండి కీలక వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ రంగంలో గ్లోబల్ కనెక్టివిటీ, ఆహార భద్రత, సరఫరా వ్యవస్థలు, ఆధునిక సాంకేతికత వినియోగంపై విస్తృతంగా చర్చించారు. సింగపూర్ దేశం తన అవసరాల కోసం సుమారు 80 శాతం ఆహార ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటున్న నేపథ్యంలో, ఆ దేశం అనుసరిస్తున్న ఆహార భద్రతా విధానాలు, నిల్వ పద్ధతులు, సరఫరా అనుబంధాల నిర్వహణపై మంత్రి వివరాలు తెలుసుకున్నారు.

# నాణ్యత, వేగంపై దృష్టి సారించండి

### పోలవరం నిర్మాణంలో ప్రతి రోజూ కీలకమే..
### కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి వి ఎల్ కాంతారావు ..

**పోలవరం, మార్చి 25:**
పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యత తో పాటు పనుల వేగం పై దృష్టి సారించాల్సిందిగా కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి ఎం ఎల్ కాంతారావు సూచించారు. ప్రాజెక్ట్ నిర్మాణంలో ప్రతి క్షణం విలువైనదని, ప్రతి క్షణాన్ని సద్వినియోగం చేసుకుని పనులు చేయాలన్నారు. బుధవారం ఆయన పోలవరం ప్రాజెక్ట్ సి ఈ ఓ యోగేష్ పైతాన్కర్ , నూతన సి ఈ ఓ గా నియమితులైన సంజీవ్ వోహ్రా, పీ పీ ఏ చీఫ్ ఇంజనీర్ కే రమేష్ తో కలిసి పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం పీ పీ ఏ అధికారులు, ఆంధ్ర ప్రదేశ్ జలవనరుల శాఖ అధికారులు, నిర్మాణ సంస్థ ఎం ఈ ఐ ఎల్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఇప్పటి వరకు జరిగిన పనులు, ఇక ముందు జరగాల్సిన పనులు, వాటికి సంబంధించిన ప్రణాళిక, ఎదురైతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై సమీక్షించారు. సుమారు ఐదు గంటలపాటు ఆయన పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ ప్రాంతంలో గడిపారు. పోలవరం ప్రాజెక్ట్ ను వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ప్రకటించిన నేపథ్యంలో ... అలా పూర్తి చేయటానికి రూపొందించుకున్న ప్రణాళిక వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు పోలవరం ప్రాజెక్ట్ లో పనులు నిర్దేశిత ప్రణాళిక ప్రణాళిక ప్రకారం జరుగుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. ఇక ముందు కూడా అదే విధమైన ప్రణాళికతో పనులు చేయాలని కోరారు. ఇప్పటి వరకు ప్రతి క్షణం విలువైనదే, ఇక ముందు ఒక్క క్షణం వృధా అయినా దాని ప్రభావం ప్రాజెక్ట్ నిర్మాణం పై పడుతుంది, నిర్దేశించిన లక్ష్యాలు చేరలేరు అని అన్నారు. జల వనరుల శాఖ అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు ప్రతి రోజూ ఒక లక్ష్యాన్ని పెట్టుకుని దాన్ని పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించుకుని పని చేయాలని సూచించారు. ప్రాజెక్ట్ పూర్తి చేసేందుకు అవసరమైన పూర్తి సహకారాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. ఆకృతులకు అనుమతులు కూడా మంజూరు చేస్తామని చెప్పారు. ఇప్పటి వరకు పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ కార్యాలయం హైదరాబాద్ లో ఉండటం వల్ల కొంత సమన్వలోపం ఉందని, ఇక నుంచి ఆ కార్యాలయం రాజమహేంద్రవరం నుంచి పని చేస్తున్నందున ప్రతి రోజు ఏ సమస్య ఉన్న వెంటనే సమావేశమై పరిష్కరించుకోవాలి అని చెప్పారు. త్వరలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ



శాఖలు అన్నింటితో తాను సమావేశం నిర్వహిస్తానని చెప్పారు. ప్రాజెక్ట్ నిర్మాణ పురోగతిని ఇంజనీర్ ఇన్ చీఫ్ కె నరసింహమూర్తి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ప్రాజెక్ట్ నిర్వాసితుల పునరావాసం, భూసేకరణ గురించి కూడా తెలిపారు.
ప్రాజెక్ట్ నిర్మాణ ప్రాంతాన్ని కలియ తిరిగిన కాంతారావు బట్రస్ డ్యామ్ వద్ద పరిశీలన చేశారు. అక్కడి నుంచి ప్రాజెక్ట్ వివరాలు తెలుసుకున్నారు. దయాఫ్రమ్ వాల్ గ్యాప్ 1, 2, డి హిల్, జి హిల్ మొదలైన వాటిని పరిశీలించారు. వాటిని పూర్తి చేసేందుకు నిర్దేశించిన గడువును అడిగి తెలుసుకున్నారు. పోలవరం జల విద్యుత్ కేంద్రాన్ని కూడా ఆయన పరిశీలించారు. ప్రాజెక్ట్ ఎప్పటికి పూర్తి అవుతుందో అడిగి తెలుసుకున్నారు.

# చిన్నకొత్తిలిలో రైతన్న మీకోసం వారోత్సవాలు

**ఎమ్మిగనూరు (తెలుగోడు), మార్చి 25 :**
నందవరం మండల పరిధిలోని చిన్నకొత్తిలి గ్రామంలో రైతన్న. మీకోసం వారోత్సవాలు నిర్వహించారు. ఇంటింటికి ప్రచారం, అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో టీడీపీ కర్నూలు పార్లమెంట్ అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి గ్రామంలో రూ.55 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం అన్నదాత సుఖీభవ పథకం కింద ఈ సంవత్సరానికి రైతులకు వ్యవసాయ అవసరాల కోసం ప్రభుత్వం రూ. 20,000 ఆర్థిక సహాయం విడుదల చేసిన విషయాన్ని గ్రామ ప్రజలకు వివరించి, రైతులకు కూటమి ప్రభుత్వం అందిస్తున్న సహాయంపై అవగాహన కల్పించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి



మాట్లాడుతున్న టీడీపీ కర్నూలు పార్లమెంట్ అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ

ఈ సందర్భంగా కర్నూలు పార్లమెంట్ అధ్యక్షురాలు శ్రీమతి గుడిసె కృష్ణమ్మ మాట్లాడుతూ బీవీ మోహన్ రెడ్డి తనయుడు ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డితో కలిసి చిన్నకొత్తిలి గ్రామంలో పాల్గొనడం ఆనందంగా ఉందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తూ ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తున్నదని పేర్కొన్నారు. టీడీపీ కర్నూలు పార్లమెంట్ అధ్యక్షురాలిగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి గ్రామంలోని పలు ప్రాంతాలను సందర్శించి తాగునీటి సరఫరా, కొత్త రోడ్లు, కాలువలు, పారిశుధ్యం, ప్రజా సమస్యలు, ఇతర ప్రభుత్వ పథకాల అమలుపై సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు పార్లమెంట్ అధ్యక్షురాలు, మార్కెట్ కమిటీ చైర్మన్, పీఏసీఎస్ అధ్యక్షుడు, మండల కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, అధికారులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సిసి రోడ్డును ప్రారంభిస్తున్న మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి, టీడీపీ కర్నూలు పార్లమెంట్ అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ. నేతలను సన్మానిస్తున్న దృశ్యం

# ఇళ్లులేని పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలి

### తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ ధర్నా ..

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 25 :**
ఇళ్లులేని పేదలకు ఇంటి నిర్మాణానికి తక్షణమే నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం పెద్దకడబూరులోని మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి వీరేష్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయ, మండల సహాయ కార్యదర్శి కుమ్మరి చంద్ర మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇళ్లులేని అర్హులైన పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు స్థలం కేటాయించి ఇళ్ల నిర్మాణానికి రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని కూటమి ప్రభుత్వం



ధర్నా నుద్దేశించి మాట్లాడుతున్న సీపీఐ మండల కార్యదర్శి వీరేష్



డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏఎస్ఓ వెంకటేశ్వర్లకు అందజేస్తున్న దృశ్యం

హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. పేదల గృహ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోందని తీవ్రంగా విమర్శించారు.
పేద ప్రజలు సంవత్సరాలుగా ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇంటి స్థలం, గృహ నిర్మాణ నిధులు అందించాలని వారు డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను కూడా తక్షణమే అమలు చేయాలని కోరారు. లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏఎస్ఓ వెంకటేశ్వర్లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామాంజి, రవి, అగ్గి రాముడు, మాబు వలి, వీరన్న, నాగప్ప, రాము తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాఠశాల కార్యదర్శి ఫణిభూషన్ శర్మ

# శ్రీ సరస్వతీ విద్యా మందిరం 33వ వార్షికోత్సవం



డాక్టర్ సంధ్యా లక్ష్మికి చిరు సత్కారం.డాక్టర్ సంధ్యాలక్ష్మితో ఉపాధ్యాయ స్థానిక కమిటీ బృందం

**అమరాపురం (తెలుగోడు), మార్చి 25 :**
హిందూపురం నియోజకవర్గం శ్రీకంఠపురంలో ఉన్న శ్రీ సరస్వతీ విద్యా మందిరం 33వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానాచార్యులు పి. జయంతి, కార్యదర్శి పని భూషణ్ మాట్లాడుతూ విద్యాభారతి లక్ష్య సాకారానికి సంయుక్త ఆంధ్రప్రదేశ్‌లో 1967లో శిశుమందిర్ ప్రారంభమైందని, 1973లో శ్రీ సరస్వతీ విద్యాపీఠం ఒక సంస్థగా ఆవిర్భవించిందన్నారు. శ్రీ సరస్వతీ విద్యాపీఠంకు అనుబందముగా శ్రీ సరస్వతీ విద్యామందిరాలు శాఖోపశాఖలుగా విస్తరించాయన్నారు. అందులో భాగంగా శ్రీ సరస్వతీ విద్యామందిరం శ్రీకంఠపురం గ్రామంలో 1993లో 25 మంది విద్యార్థులతో ఎల్కేజీ, యూకేజీ, 1వ తరగతులతో ఒక అద్దె భవనంలో ప్రారంభమైందన్నారు. దినదినాభివృద్ధి చెందుతూ 5వ తరగతి వరకు ప్రాథమిక పాఠశాలగా మారిందన్నారు.దాతల విరాళాలతో 2001లో సొంత భవనం నిర్మాణం చేపట్టామన్నారు. పాఠశాల అభివృద్ధికి ప్రబంధకారిణి ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం 95 మంది బాలబాలికలకు జాతీయ విద్య ద్వారా విద్యా ఫలాలను సమాజానికి అందిస్తూ వస్తున్న సమాజపోషిత సంస్థ శ్రీ సరస్వతీ విద్యామందిరం అని అన్నారు.

శ్రీ సరస్వతీ విద్యాపీఠం ద్వారా ప్రత్యేక శిక్షణ పొంది సుశిక్షితులైన ఆచార్యుల ద్వారా విద్యాబోధన జరుగుతోందన్నారు. బాలబాలికలలో



కోలాటం ఆడుతున్న చిన్నారులు

హిందూ జీవన విధానం దేశభక్తి, శారీరక్, యోగ సంస్కృతం నైతిక ఆధ్యాత్మిక విద్యలలో శిక్షణ ఇస్తూ సమగ్ర వికాసానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం పాఠశాల సి. ఏ ఆడిటర్ చేత ఆడిట్ చేయించబడునని పాఠశాల ప్రధానాచార్యులు శ్రీమతి పి..జయంతి తెలిపారు.

ఈ కార్యక్రమంలో చిన్నారులు చేసిన కార్యక్రమాలు యోగా, కోలాటం, డంబుల్స్, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విజేతలకు కమిటీ సభ్యులు బహుమతులు అందించారు, ఈ కార్యక్రమంలో చైర్మన్ రామానందన్ దుర్గపాపనాశ టెంపుల్ లేపాక్షి , కే. ఏ. రాధాకృష్ణ జిల్లా కార్యదర్శి, డాక్టర్ సంధ్యాలక్ష్మి మాకం రమేష్ బాబు జిల్లా సమీప ఇతర విద్యా మందిరాల ప్రధానాచార్యులు కలవటాల మురళీకృష్ణ అమరాపురం శ్రీమతి నాగమణి చౌలూరు కమలా కాంత్, సంతేబిదానూర్, నందీశ్వర్ అనంతపురం సమితి అంకెక్షక్ పాల్గొన్నారు.



అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శనలు

# శ్రీ దత్తాత్రేయ ఆశ్రమంలో శ్రీ గాయత్రీ సప్తహ

### ఆశ్రమ పీఠాధిపతి శ్రీ సిద్దేశ్వర స్వామి..

**అమరాపురం (తెలుగోడు), మార్చి 25 :**
మండల పరిధిలో హేమావతి గ్రామంలో వెలసిన శ్రీ దత్తాత్రేయ ఆశ్రమమునందు శ్రీ గాయత్రి సప్తహ కార్యక్రమం ఈనెల 27 నుండి ఏప్రిల్ 2 వ తేదీ వరకు అతి వైభవంగా నిర్వహించనున్నట్లు శ్రీ దత్తాత్రేయ గురుకుల ఆశ్రమ పీఠాధిపతి శ్రీ సిద్దేశ్వర స్వామి పేర్కొన్నారు. బ్రాహ్మణి ముహూర్తము నందు కలసస్థాపన, ధ్వజారోహణ రాత్రి 9 గంటల నుండి 12 గంటల వరకు భజన కార్యక్రమం ప్రతిరోజు సత్సంగం, భజన కార్యక్రమం, ఆశ్రమానికి వచ్చు భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నం వితరణ నిర్వహించనున్న వారు తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆశ్రమ పీఠాధిపతి శ్రీ సిద్దేశ్వర స్వామి కోరారు.





శ్రీ గాయత్రీ దేవి కి పూలతో అలంకరణ. శ్రీ గాయత్రీ దేవి కి పూజలు నిర్వహిస్తున్న ఆశ్రమ పీఠాధిపతి శ్రీ సిద్దేశ్వర స్వామి



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

# రేషన్ షాప్ డీలర్లతో సమావేశం

### తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి. సి ఎన్ డి టి మల్లేష్..

**యాడికి (తెలుగోడు), మార్చి 25 :**
యాడికి తహసిల్దార్ కార్యాలయంలో బుధవారం మండలంలోని రేషన్ షాప్ డీలర్లతో తహసిల్దార్ ప్రతాపరెడ్డి సిఎస్టి మల్లేష్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రేషన్ షాప్ డీలర్లకు వివరిస్తూ ప్రతి నెల ఒకటో తేదీ నుండి ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర సరుకులు బియ్యం సక్రమంగా అందివ్వాలని అలాగే తూకంలో తేడా రాకుండా చూడాలని వారు సూచించారు. అలాగే 65 సంవత్సరాలు నిండిన వృద్ధులకు ప్రభుత్వం నిబంధనల ప్రకారం 26 నుండి 30 తేదీ వరకు ఇంటి వద్దకు వెళ్లి బియ్యం పంపిణీ చేయాలని తెలిపాడు. ఇక ముందుకు ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని డీలర్లకు సూచించారు. పతి డీలరు స్టోర్ వద్ద నిత్యావసర వస్తువుల పట్టిక వాటి రేట్లు బోర్డు ఏర్పాటు చేయాలని తదితర వాటిపై డీలర్లకు అవగాహన కలిగించాడు. స్టోర్ బియ్యం వీరు తూకాలు గోడం నుండి బియ్యం కొలతలు సక్రమంగా వేసుకొని ప్రజలకు కూడా డబ్బా తూకం లేకుండా సక్రమంగా ఇవ్వాలని సూచించారు. ఎవరైనా డబ్బా తూకం వేసినట్లయితే అధికారులు పట్టుపడితే డీలర్ షిప్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ప్రతాపరెడ్డి సి ఎస్ డి టి మల్లేష్ తోపాటు డీలర్లు పాల్గొన్నారు.



యాడికిలో డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న సి ఎస్ టి టి మల్లేష్

# సర్పంచ్ సువర్ణ అశ్వర్ రెడ్డికి పరామర్శ

**నల్లమాడ (తెలుగోడు), మార్చి 25 :**
గోరంట్ల మండలం మల సముద్రం పంచాయతీ సర్పంచ్ సువర్ణ అశ్వర్ రెడ్డి కాలికి శస్త్రచికిత్స చేయించుకొని ఇంటిలో విశ్రాంతి తీసుకుంటుండగా హిందూపురం పార్లమెంట్ సభ్యులు బి కే పార్థసారథి తనయుడు యువ నాయకుడు బి కే సాయి కళ్యాణ్ నాయకులు తదితరులు ఇంటికి వెళ్లి పరామర్శించారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

# 96 లక్షలతో పరారీ

### పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు..

**యాడికి (తెలుగోడు), మార్చి 25 :**
యాడికిలో నివాసముంటున్న దాసరి నరసింహుడు 98,52,000 అప్పుచేసి పరారయ్యాడు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. యాడికి గ్రామం నారాయణస్వామి కాలనీలో నివాసం ఉంటున్న దాసరి లక్ష్మినారాయణ కుమారుడు దాసరి నరసింహుడు (బాబు) గత కొన్ని సంవత్సరాలుగా పట్టుచీరల వ్యాపారాన్ని చేస్తున్నాడు. ఈ వ్యాపార లావాదేవాల వ్యవహారంలో తోటి వ్యాపారస్థులు, తన వద్ద మగ్గం నేస్తున్న కార్మికులు,, చీటీల వ్యాపారస్తులు, తోటి స్నేహితులు, బంధువుల వద్ద ఇబ్బడిముబ్బడిగా అప్పు చేశారు. ద్వాక్రా సంఘాలలో తన భార్య పేర లోన్ తీసుకున్నాడు. 25 మంది వద్ద అప్పు చేసిన రూ. 98,52,000 తీసుకుని గ్రామం నుండి రాత్రికి రాత్ర భార్య పిల్లలతో పరారయ్యాడు . ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తోంది. దీంతో బాధితులు లబోదిబోమంటూ బుధవారం పోలీస్ స్టేషన్లో సీఐ శ్రీనివాసుకు ఫిర్యాదు చేశారు. దాదాపు రెండు కోట్ల 50 లక్షలు పైనే అప్పు ఉంటుందని బాధితులు వాపోతున్నారు.

# నల్లమాడలో జాయింట్ కలెక్టర్ తనిఖీలు

**నల్లమాడ (తెలుగోడు), మార్చి 25 :**
నల్లమాడ మండలంలో జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ బుధవారం విస్తృతంగా పర్యటిస్తూ పలు ప్రభుత్వ కార్యక్రమాల అమలును సమీక్షించారు. మండలంలోని వేళ్లమద్ది గ్రామంలో పొలాల రీ సర్వే పూర్తి కావడంతో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీకి సంబంధించి ఈ-కేవైసీ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. లబ్ధిదారుల వివరాలు సక్రమంగా నమోదు చేయాలని, ఎటువంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం యర్రవంకపల్లి గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్, అక్కడి సేవల నిర్వహణ, ప్రజలకు అందుతున్న సదుపాయాలపై సమీక్ష నిర్వహించారు. సచివాలయ సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తూనే, సేవలను మరింత మెరుగుపరచాలని సూచనలు చేశారు.

తదుపరి నల్లమాడ తహసీల్దారు కార్యాలయాన్ని సందర్శించిన జాయింట్ కలెక్టర్, రెవెన్యూ అంశాలపై నిర్వహించిన సమావేశంలో అధికారులకు



ఎర్రవంకపల్లిలో రైతులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



నల్లమాడ తహసిల్దార్ కార్యాలయంలో తనిఖీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

పలు కీలక దిశానిర్దేశాలు చేశారు. భూ వివాదాల పరిష్కారంలో ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. రీ సర్వే అనంతరం వచ్చే ఫిర్యాదులను ప్రాధాన్యంగా తీసుకుని వేగంగా పరిష్కరించాలన్నారు.

అలాగే భూ రికార్డుల నవీకరణలో పారదర్శకత పాటించాలని, డిజిటల్ రికార్డులు మరియు భౌతిక రికార్డుల మధ్య ఏవైనా వ్యత్యాసాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని అధికారులను ఆదేశించారు. గ్రామ స్థాయిలో రెవెన్యూ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని, సమస్యలు వచ్చిన వెంటనే స్పందించే విధంగా వ్యవస్థను బలోపేతం చేయాలని పేర్కొన్నారు.

పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు అర్హులందరికీ న్యాయం జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా రెవెన్యూ శాఖ పనిచేయాలని ఆయన సూచించారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సువర్ణ, తహసీల్దారు కె. మనోజ్ కుమార్ రెడ్డి, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# బి ఫార్మసీ విద్యార్థిని త్మహత్యాయత్నం

**ఏలూరు (తెలుగోడు), మార్చి 25 :**
ఏలూరు నగరంలోని సి ఆర్ రెడ్డి ఫార్మసీ కళాశాలలో బి ఫార్మసీ మూడో సంవత్సరం చదువుతున్న చిలుకూరి సువర్షిని హాస్టల్ భవనం పైనుండి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటన బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గమనించిన తోటి విద్యార్థులు హాస్టల్ వార్డెన్ ఆమెను ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగని వైద్యం కోసం విజయవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు పోలీసులు విచారణ చేపట్టారు



# రూ.5.50 లక్షలలో డ్వాక్రా సంఘం సభ్యురాలు పరారీ



సీఐ శ్రీనివాసులక ఫిర్యాదు చేస్తున్న సంఘం సభ్యులు

**యాడికి (తెలుగోడు), మార్చి 25 :**
యాండికి గ్రామము లోని వెంగమనాయుడు కాలనీలో ఉండే డ్వాక్రా సంఘం సభ్యురాలు రూ. 5.50 లక్షలలో పరారైనట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అమ్మభగవాన్ సంఘం సభ్యురాలు తనకు వచ్చిన డబ్బులు రూ. 2,00,000, మరో ఇద్దరు సభ్యుల నుంచి రూ. 2,00,000, సుమలత అనే సభ్యురాలి నుంచి రూ. 50,000 గ్రామ సంఘంలో రూ. 1,00,000 మొత్తం రూ. 5, 50,000తో పరారయ్యారు. ఈ మేరకు సంఘం సభ్యులు శకుంతల, సావిత్రి, సుమలత, సరస్వతి, అలివేలి, గంగాదేవి, సునీత, నాగమణ, హేమావతి, నారమ్మ బుధవారం పోలీస్ స్టేషన్లో సీఐ శ్రీనివాసులకు ఫిర్యాదు చేశారు.

# పోలీసుస్టేషన్‌కి ప్రముఖుల ఫొటోలు బహూకరణ

**రొళ్ల (తెలుగోడు), మార్చి 25 :**
స్థానిక పోలీస్ స్టేషన్ కు బుధవారం డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ఉప ముఖ్యమంత్రి, పవన్ కళ్యాణ్, ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీ చిత్రపటాలను ఎస్ ఐ గౌతమి అందించారు. ఈ కార్యక్రమంలో మడకశిర నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త టి రంగస్వామి, రొళ్ళ మండలం ఉపాధ్యక్షులు రత్నగిరి గొపి, బిజెపి అధ్యక్షుడు బద్రి నాయక్, పరమేష్, హనుమంతరాయప్ప, దొడ్డహనుమప్ప, తదితరులు పాల్గొన్నారు.



స్టేషన్‌కి అంబేద్కర్ చిత్రపటాన్ని అందిస్తున్న నాయకులు



మోడీ, పవన్ కళ్యాణ్ చిత్రపటాలను అందిస్తున్న నాయకులు

# నల్లమాడలో సోదరభావంతో రంజాన్ విందు

**నల్లమాడ (తెలుగోడు), మార్చి 25 :**
నల్లమాడలోని మక్కా మసీదులో రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు మండలంలోని అధికారులకు ఘనంగా విందు ఏర్పాటు చేశారు. పండుగ స్ఫూర్తిని ప్రతిబింబించేలా మధ్యాహ్న సమయంలో అధికారులు మసీదుకు చేరుకుని ప్రత్యేకంగా సిద్ధం చేసిన వంటకాలను ఆస్వాదించారు. ఆతిథ్య సత్కారం, పరస్పర స్నేహభావం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ శరత్ కుమార్, మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్, ఎస్సై శరత్ కుమార్‌లను ముస్లిం సోదరులు



అధికారులను సన్మానిస్తున్న ముస్లిం సోదరులు



విందు ఆరగిస్తున్న అధికారులు

శాలువాలతో ఘనంగా సత్కరించారు. అధికారుల సేవలను కొనియాడుతూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మండలానికి చెందిన పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు. గ్రామంలోని మూడు మసీదులకు చెందిన జమాత్ సభ్యులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ముస్లిం పెద్దలు మాట్లాడుతూ రంజాన్ పండుగ పరమార్థం సేవా భావం, పరస్పర గౌరవం అని పేర్కొన్నారు. అన్ని మతాల ప్రజలు ఐక్యతతో జీవించడం సమాజానికి శ్రేయస్కరమని అన్నారు.

ఈ విందు కార్యక్రమం ద్వారా మత సామరస్యానికి నల్లమాడ ఆదర్శంగా నిలిచిందని పాల్గొన్న అధికారులు అభిప్రాయపడ్డారు. ఇలాంటి కార్యక్రమాలు సామాజిక ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.



చిన్నారి అను దీప్తిని సన్మానిస్తున్న వైఎస్ఆర్సిపి నాయకురాలు చంద్రగిరి రాధా యాదవ్

## నంది పురస్కారం అందుకున్న చిన్నారి అను దీప్తికి అభినందనలు

**వైసీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు చంద్రగిరి రాధా యాదవ్..**

**గుత్తి (తెలుగోడు), మార్చి 25 :**
గుత్తి మండల పరిధిలోని జక్కలచెరువు గ్రామానికి చెందిన చిన్నారి అను దీప్తి ని బుధవారం సాయంత్రం వైఎస్ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షురాలు చంద్రగిరి రాధా యాదవ్ ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు. ఈ నెల 8వ తేదీన హైదరాబాద్ లోని త్యాగరాయగానా సభలో మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఉగాది పురస్కారాలకు గుత్తి మండల పరిధిలోని జక్కలచెరువు గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన సాంబశివుడు, అనిత దంపతులకు జన్మించిన చిన్నారి అనుదీప్తి నృత్య విభాగం లో తన గొప్ప నృత్య ప్రతిభతో అందరిని అలరించి ఉగాది నంది పురస్కారాన్ని అందుకుంది . ఈ విషయం తెలుసుకున్న గుత్తి మండలం సూరశింగన పల్లి గ్రామానికి చెందిన అనంతపురం జిల్లా వైసీపీ ఉపాధ్యక్షురాలు చంద్రగిరి రాధా యాదవ్ జక్కల చెరువుగ్రామానికి వెళ్లి చిన్నారి అను దీప్తిని మరియు వారి తల్లితండ్రులను సన్మానించి చిన్నారికి ఆర్థిక సహాయం అందించారు అలాగే వారికీ మున్ముందు మరింత స్థాయికి వెళ్ళాలి అని కోరుకున్నారు ఈ కార్యక్రమం లో ఆర్.ఆర్ డాన్స్ అకాడమీ డాన్స్ మాస్టర్ రవి,తల్లితండ్రులు మరియు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## చంద్రన్నతో చేనేత జీవితాల్లో వెలుగులు

**పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల లక్ష్మీ నరసింహులు**

**అనంతపురం రూరల్ (తెలుగోడు), మార్చి 25 :**
నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ చేనేత జీవితాల్లో వెలుగులు నింపారని ఆంధ్రప్రదేశ్ పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు అన్నారు. బుధవారం స్థానిక సిండికేట్ నగర్ ప్రాంతంలో పద్మశాలి డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు చేనేత కళాకారులు దేవరకొండ రామాంజినేయులు, మహేష్, అభిలాష్, మెటీకల రామకృష్ణ ఇళ్లకు వెళ్లి కూటమి ప్రభుత్వం ఏప్రిల్ 1 తేదీ నుండి హ్యాండ్లూమ్ కు 200 యూనిట్లు, పవర్ లూమ్స్ కు 500 యూనిట్లు ఉచిత విద్యుత్తు అందిస్తున్నదని, చేతి మగ్గాలు నేసే నేతన్నలకు నెలకు సుమారు పన్నెండు వందల రూపాయలు, మర మగ్గాలా నేతన్నలకు నెలకు ఐదు వేల రూపాయలు వరకు లబ్ధి చేకూరుతున్నదని చేనేత కళాకారులకు, కుటుంబ సభ్యులకు తెలియజేయడం జరిగింది. నారా లోకేష్ యువ గళం పాదయాత్రలో నేతన్నల కష్టాలను చూసి అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం ఉచిత విద్యుత్తును అందిస్తామని హామీ ఇచ్చి,నేడు అమలులోకి తీసుకురావడం అభినందనీయమని కొనియాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేనేతల జీవితాలలో వెలుగులు నింపడానికి కృషి చేయడం సంతోషమని, చేనేత కుటుంబాలు హర్షం వ్యక్తం చేశారు. చేనేత, జౌళీ శాఖ మంత్రి సబిత శాసనసభ సమావేశాల్లోను,అనేక కార్యక్రమాల్లో ఆప్కో ద్వారా దుకాణాలు ఏర్పాటు చేయించి, వస్త్రాలను అమ్మకాలు జరపడం తద్వారా చేనేత వస్త్రాల ధరింపు ఆవశ్యకతను తెలిపిన మంత్రివర్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అనంతపురం జిల్లా కేంద్రంలో టెక్స్ టైల్ పార్కును ఏర్పాటుకు కృషి చేయాలని, కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో చేనేత వృత్తిపైన ఆధారపడినటువంటి కుటుంబాలకు ఉచిత విద్యుత్తును అందించడం వారి జీవితాల్లో చీకటిని దూరం చేసి వెలుగును నింపినందుకు చేనేత కుటుంబాలు కూటమి ప్రభుత్వానికి,నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్,పరిటాల సునీత గారికి ధన్యవాదాలు తెలియజేయడం ఆనందాన్నిచ్చిందని పోతుల లక్ష్మీనరసింహులు అన్నారు. ఈ కార్యక్రమంలో సిండికేట్ నగర్ తెలుగుదేశం పార్టీ నాయకులు పుత్త ఎర్రిస్వామి హాజరయ్యారు.

## లేపాక్షి రాయితీ అమ్మకాలకు విశేష స్పందన

**విజయవాడ (తెలుగోడు), మార్చి 25 :**
ఆంధ్రప్రదేశ్ హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (లేపాక్షి) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న క్లియరెన్స్ సేల్‌కు హస్తకళల ప్రేమికుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. మరో ఐదు రోజులు మాత్రమే గడువు ఉండటంతో వినియోగదారులు ఆసక్తిగా కొనుగోళ్లు చేస్తున్నారు. ఎంపిక చేసిన ఉత్పత్తులపై గరిష్టంగా 50 శాతం వరకు రాయితీ అందుబాటులో ఉండటంతో అన్ని షోరూమ్‌లలో సందడి నెలకొంది. మార్చి 1న ప్రారంభమైన ఈ వార్షిక సేల్ మార్చి 31 వరకు అన్ని లేపాక్షి షోరూమ్‌లలో కొనసాగుతోంది. సంవత్సరంలో ఒక్కసారి మాత్రమే నిర్వహించే ఈ రాయితీ అమ్మకాలను వినియోగించుకునేందుకు వినియోగదారులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఈ సేల్‌లో కొండపల్లి బొమ్మలు, ఎటికొప్పాక కళాఖండాలు, చెక్క శిల్పాలు, కలంకారి చీరలు, బొబ్బిలి వీణ, కంచు విగ్రహాలు, రాయి శిల్పాలు, తోలుబొమ్మలాట కళాఖండాలు, పెన్ కలంకారి, సవారా ఆదివాసి చిత్రాలు, బుడిది పిత్తళి వస్తువులు వంటి విభిన్న హస్తకళా ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం, కర్నూలు, రాజమండ్రి, అనంతపురం, హైదరాబాద్ తదితర నగరాల్లోని లేపాక్షి షోరూమ్‌లలో కొనుగోలు దారుల రద్దీ కనిపిస్తోంది. హస్తకళాకారులకు మద్దతు ఇవ్వడం, సాంప్రదాయ కళలను పరిరక్షించడం, సంప్రదాయ నైపుణ్యాలను ప్రోత్సహించడం లక్ష్యం అన్నారు.

## సంవత్సరకాలం ఆర్డిటి సేవలను అడ్డుకొని ప్రజల విజయంతో టిడిపి సంబరాలు!

టిడిపి సంబరాలు, కేక్ కటింగ్ దేనికోసం. ఆర్డిటి సేవలను సంవత్సరకాలం అడ్డుకున్నందులకా, అందులో పనిచేస్తున్న ఉద్యోగస్తులను బజారు పాలు చేసినందులకా లేక ఆర్డిటి ఉచితంగా అందిస్తున్న విద్య, వైద్య అత్యవసర సేవలు నిలిపివేసి అన్ని వర్గాల ప్రజలను అనాథలను చేసినందులకా. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంటూ 57 సంవత్సరములుగా సహస సిద్ధంగా,సాంప్రదాయబద్ధంగా రెన్యువల్ అవుతూ వస్తున్న ఎఫ్సీఆర్ఏ పునరుద్ధరణ ప్రక్రియను ఉద్దేశపూర్వకంగా సంవత్సరకాలం ఆపివేసిన కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించలేక నానా తంటాలు పడితే ప్రజా సంఘాలు, దళిత, బహుజన సంఘాలు, ప్రతిపక్ష రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ప్రజలు స్వచ్ఛందంగా వీధులలోకి వచ్చి పోరాటాలు చేసిన ఫలితంగా కేంద్రం దిగివచ్చి ఎఫ్సీఆర్ఏ ను పునరుద్ధరణ చేస్తే అది మీ గొప్పతనంగా చెప్పుకోవడం సిగ్గు కాదా? మీ ద్వారానే అయి ఉంటే ఇన్ని రోజులు ఆలస్యం ఎందుకు అయినట్లు. ప్రజలు వీధులలోకి రావాల్సిన అవసరం ఏమొచ్చిందో చెప్పగలరా? మీరు చేయలేక చతికిలబడి ప్రజా ఉద్యమాల కారణంగా వచ్చిన ఫలితాన్ని తగుదునమ్మా అని తన ఖాతాలో వేసుకునే నీచత్వానికి, దారుణానికి ఒడిగట్టి దానినే తమ గొప్ప తనంగా చెప్పుకొని, కేకులు కట్ చేసుకోవడం మీ అల్ప బుద్ధికి, మీ చేతగాని తనానికి నిదర్శనం.



ఆర్డిటికి ప్రజలతో అల్లుకున్న బంధం మీకు ఈ రోజే తెలిసిందా. విద్య, వైద్యం, క్రీడలు, సాంస్కృతికం, ఎకాలజీ మహిళా సాధికారత, దివ్యాంగుల అభ్యున్నతి, గృహ నిర్మాణం ఇలా అనేక రంగాలలో ఆర్ డి టి చేస్తున్న సేవలను సంవత్సర కాలం స్తంభింప చేశారు,ఈ నష్టాన్ని మీ ప్రభుత్వం పూడ్చగలదా. 16 సంవత్సరములుగా ప్రతి ఏటా 360 మంది పేద విద్యార్థులను ఉన్నత చదువులకు పంపించే ప్రక్రియ ఆగిపోయిన కారణంగా ఈ సంవత్సరం 360 మంది పేద పిల్లలు ఉన్నత చదువులకు పోలేకపోయారే,దీనికి మీరు బాధ్యతలు కారా? ఆ 360 మంది పేద విద్యార్థుల ఉసురు మీకు తగలదా. క్రీడా అకాడమీ, శిక్షణ శిబిరాలు, హాకీ, ఫుట్బాల్, జూడో అకాడమీలు మూతపడిపోయాయి,పల్లెల్లో సాంస్కృతి కార్యక్రమాలు ఆగిపోయాయి,వీటికన్నిటికీ మూలం మీ చేతకానితనం కాదా. ఇంత చేసి ప్రజలు సాధించుకున్న విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంటున్నారంటే, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందాలనే మీ దుర్బుద్ధి ప్రజలకు కనపడడం లేదా. అందుకే ఆర్డిటి లబ్ధిదారులు,ఆర్డిటి ఎఫ్ సి ఆర్ ఏ రెన్యువల్ కోసం పోరాడిన యోధులు,ఇది ప్రజల సమిష్టి విజయంగా భావించి,తెలుగుదేశం పార్టీ కుట్రలను,వారి చేతగాని తనాన్ని బహిరంగ పరిచి,ఇది ప్రజలందరి విజయంగా విజయోత్సవం నిర్వహిద్దాం, ఉద్యమకారులకు జేజేలు పలుకుదాం. భవిష్యత్తులో ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక చర్యలు,కుట్రలు,కుతంత్రాలకు పూనుకుంటే మేమంతా ఐక్యమై సాధించు కుంటామనే సంకేతాలను పంపుదాం.

**– కె.వి రమణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు,**
**"వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక" అనంతపురం.**

## యాడికి ఆరోగ్య కేంద్రం రికార్డులు తనిఖీ

**డి ఐ ఓ. నాగ శశిభూషణ్ రెడ్డి..**

**యాడికి (తెలుగోడు), మార్చి 25 :**
యాడికి ప్రభుత్వ వైద్యశాల రికార్డును డి ఐ ఓ నాగ శేష భూషణ్ రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య అధికారులు, సిబ్బంది హాజరు పట్టిక రికార్డులు, రక్త పరీక్ష కేంద్రం రికార్డులు, మందుల రికార్డులు పరిశీలించారు అనంతరం అధికారులతో సిబ్బందితో ఆసుపత్రి స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. మందుల గది పరిశీలించి మందుల స్టాక్ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాన్పుగది పరిశీలించారు యాడికి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో కాన్పు అయినా వార్డులోకి వెళ్లి తల్లి పిల్ల ఆరోగ్య సమస్య అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలోనే కాన్పులు చేసుకోవాలని ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో యాడికి వైద్యులు పరమేశ్వర్. డాక్టర్ సాయి సుమంత్ రెడ్డి. సిబ్బంది జుబేదా. శోభ. రాంప్రసాద్ గౌడ్. మద్దిలేటి వైద్య సిబ్బంది పాల్గొన్నారు



కాన్పుల వార్డులో తల్లీపిల్లల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకుంటున్న డి ఐ ఓ నాగ శశి భూషణ్ రెడ్డి



యాడికి ప్రభుత్వ వైద్యశాలలో రికార్డులను తనిఖీ చేస్తున్న డి ఐ ఓ శశి భూషణ్ రెడ్డి మందుల గదిని పరిశీలిస్తున్న దృశ్యం

## రైతు బాంధవుడు సీఎం చంద్రబాబు నాయుడు

**భూములు ఇచ్చిన రైతులకు చెక్కులు పంపిణీ..**
**ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ..**

**గుత్తి (తెలుగోడు), మార్చి 25 :**
రైతుల పాలిట రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతు బంధువుడిగా కొనసాగుతున్నడని ఆయన సేవలు ఈ రాష్ట్రానికి మరో మరో అవసరం ఎంతైనా ఉందని గుంతకల్లు నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం బుధవారం గుత్తి మండల పరిధిలోని బాచుపల్లి గ్రామం నందు జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ ఇటీవల అన్నదాత సుఖీభవ పథకం కింద మూడో విడత రూ. 6000 రైతన్నల ఖాతాలో జమ చేసినందుకుగాను లిముఖ్యమంత్రి.నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈరోజు రైతన్న మీకోసం కార్యక్రమంనిర్వహించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి



భూముల ఇచ్చిన రైతులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



బాచుపల్లిలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు రైతన్నల ఖాతాలో సంవత్సరానికి 20000వేల రూపాయలు ఇచ్చి ఆదుకుంటానని హామీ ఇవ్వడం జరిగింది ఇచ్చిన మాట ప్రకారమే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు విడతలుగా రూ.20,000 కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రైతన్నల ఖాతాలో జమ చేశారన్నారు. ఈ సందర్భంగా రైతన్నల కష్టాలను నేరుగా తెలుసుకునేందుకు నారా చంద్రబాబునాయుడు రైతుల వద్దకు వెళ్లాలని సూచించడంతో తాము గ్రామానికి వచ్చామన్నారు. ఏ సమస్యలున్నా తమ దృష్టికి తీసుకువస్తే కచ్చితంగా పరిష్కరిస్తామని అన్నారు. రైతన్నలను ఆదుకునే ఏకైక నాయకుడు రైతు బాంధవుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. అందులో భాగంగానే బేతపల్లి గ్రామ సమీపంలో నిర్మాణంలో ఉన్న రెవెన్యూ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు భూములు ఇచ్చిన రైతులకు ఆయన ప్రభుత్వం ద్వారా చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గుత్తి మండల మరియు పట్టణ టిడిపి నాయకులు మరియు కూటమి నాయకులు కార్యకర్తలు మరియు బాచుపల్లి గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..

## ఘనంగా మెగా పవర్ స్టార్ రామ్ చరణ్‌తేజ్ జన్మదిన వేడుకలు

**రక్తదానం చేసిన అభిమానులు..**

**గుత్తి (తెలుగోడు), మార్చి 25 :**
వెండితెర యువ హీరో రామ్ చరణ్ తేజ్ జన్మదినోత్సవం బుధవారం గుత్తిలో ఘనంగా నిర్వహించారు. అఖిల భారత చిరంజీవి యువత రాష్ట్ర రామ్ చరణ్ యువశక్తి ఆధ్వర్యంలో గవర్నమెంట్ హాస్పిటల్ నందు జరిగిన మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు చిరంజీవి అభిమానులు రక్తదాన శిబిరంలో పాల్గొ నివంతం చేశారు. విజయవంతం చేసిన గు మెగా ఫ్యామిలీ అభిమానులు అందరికీ ఇవే మా ధన్యవాదములు అని అఖిల భారత చిరంజీవి యువత అనంతపురం జిల్లా అధ్యక్షులు పాటిల్ సురేష్, రాష్ట్ర రామ్ చరణ్ యువశక్తి అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి బోయగడ్డ బ్రహ్మయ్య , మిదే ఓబులేష్ తదితరులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో





రక్తదానం చేస్తున్న మెగా అభిమానులు



రక్తదానం చేస్తున్న మెగా అభిమానులు

మెగా ఫ్యామిలీ అభిమానుల సంఘం నాయకులు అర్పణ హరి, షేక్షావలి అలివేలు, ధరణి కుమార్, లోకేష్, రాజేష్, రవిప్రకాష్, రోహిత్, భాస్కర్, అనిల్, శివ తదితరులు పాల్గొన్నారు

## కూల్చిన సుంకులమ్మ ఆలయం పునర్నిర్మాణం చేయాలి

**ఆలయ కమిటీ సభ్యులు...**

**యాడికి (తెలుగోడు), మార్చి 25 :**
కూల్చిన సుంకులమ్మ ఆలయం స్థానంలో కొత్త ఆలయం నిర్మించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. యాడికి మండల పరిధిలోని చందన లక్ష్మం పల్లి గ్రామంలో వెలసిన శ్రీ సుంకులమ్మ అమ్మవారి ఆలయాన్ని అగ్రవర్ణానికి చెందిన గంగిరెడ్డి. శ్రీనివాస్ రెడ్డి కూల్చివేసి అందులో పంట సాగు చేస్తున్నారన్నారు. ఈ విషయాన్ని సంవత్సరం క్రితం అధికారుల దృష్టికి తసుకువెళ్లినా స్పందించలేదన్నారు. తమ కుల దేవత శ్రీ సుంకలమ్మ తల్లి అమ్మవారి ఆలయం అదే స్థలంతో నిర్మించేందుకు అనుమతులు ఇవ్వాలని బుధవారం సుంకులమ్మ ఆలయ కమిటీ ప్రెసిడెంట్ వెంకట్రాముడు సిబ్బందితో ఎంపీడీవోకు వినతి పత్రం సమర్పించడానికి వచ్చారు. అయితే ఎంపీడీవో లేకపోవడంతో కాళీ కుర్చీకి వినత పత్రం అందించారు.



ఎంపీడీవో కార్యాలయంలో కుర్చీకి వినతిపత్రం అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



మాట్లాడుతున్న ఆలయ కమిటీ సభ్యులు

## 30న దినసరి. బస్టాండ్. జంతువధశాల వేలం

**యాడికి (తెలుగోడు), మార్చి 25 :**
యాడికి మేజర్ పంచాయితీ కార్యాలయంలో ఈనెల 30న దినసరి మార్కెట్, బస్టాండు. జంతువధశాల సుంకం వసూలుకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి అరుణ్ కుమార్. సర్పంచ్ అనురాధ తెలిపారు. 2026 ఏప్రిల్ 1 నుంచి నుండి 2027 మార్చి 31 వరకు సంవత్సర కాలం పాటు ఈ నిబంధన కొనసాగుతుందన్నారు. వేలంలో పాల్గొనదలచినవారు సంబంధిత డిపాజిట్లు చెల్లించాలన్నారు. వేలంపాట పాడిన మొత్తం 3 శాతం స్టాంపు డ్యూటీ కలుపుకొని అగ్రిమెంటుతో వెంటనే అదే రోజు ఒకే కంతుగా చెల్లించాలన్నారు. చెల్లించకుంటే వేలం రద్దు చేస్తారన్నారు. దినసరి మార్కెటుకు రూ. 1.50 లక్షలు, బస్టాండుకు రూ. 1.50 లక్షలు, జంతువధశాలకు రూ.50 వేలు ధరావత్తు చెల్లించాలన్నారు.



మాట్లాడుతున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా

## మహిళా పారిశ్రామికవేత్తలకు అండగా 'రైజ్' సెంటర్

**ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా...**

**విజయవాడ (తెలుగోడు), మార్చి 25 :**
మహిళలను కేవలం గృహిణులుగా కాకుండా, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఫిక్కీ ఫ్లో విజయవాడ చాప్టర్ ఆధ్వర్యంలో నోవాటెల్ హోటల్ లో నిర్వహించిన 'విమెన్ హుడ్' కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీ షా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.
?, గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా స్వయం సహాయక సంఘాలను పారిశ్రామిక దిశగా నడిపించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ముఖ్యంగా 'ఒక కుటుంబం – ఒక పారిశ్రామికవేత్త' అనే కాన్సెప్ట్‌లో భాగంగా మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. నీతి ఆయోగ్ గణాంకాల ప్రకారం దేశంలో మహిళా పారిశ్రామికవేత్తల సంఖ్య మెరుగుపడాల్సి ఉందని, ఆంధ్రప్రదేశ్‌లో ఈ పరిస్థితి చాలా ఆశాజనకంగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.
?గ్రామీణ మహిళల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు 'రైజ్' సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. కొత్తగా వ్యాపారం ప్రారంభించాలనుకునే మహిళలకు ఎటువంటి ముందస్తు అనుభవం లేకపోయినా, కేవలం ఆలోచనతో వస్తే చాలని, వారికి అవసరమైన శిక్షణ, మార్కెటింగ్ మెళకువలు మరియు సాంకేతిక సహకారాన్ని ఈ సెంటర్ల ద్వారా అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టు కోసం నీతి ఆయోగ్ నుండి రూ. 1.5 కోట్ల నిధులు మంజూరయ్యాయని, జిల్లా వ్యాప్తంగా ఈ కేంద్రాలను విస్తరిస్తామని ఆయన తెలిపారు. ఫిక్కీ ఫ్లో వంటి సంస్థల సహకారంతో విజయవాడను మహిళా పారిశ్రామికవేత్తల హబ్‌గా మారుస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఇన్నర్ వీల్ ఇంటర్నేషనల్ మాజీ కోశాధికారి సరిత లునాని మాట్లాడుతూ మహిళలు స్వభావరీత్యా బహుముఖ ప్రజ్ఞాశాలలని వారు లేనిదే ఈ సృష్టి మనుగడ సాధ్యం కాదని అన్నారు. పురాణాల కాలం నుండి నేటి ఆధునిక యుగం వరకు మహిళల ప్రాముఖ్యత అపారమని కొనియాడారు. హిందూ మతంలో శివ-పార్వతులు, రామ-సీత, విష్ణు-లక్ష్మి వంటి దైవ శక్తులు కూడా మహిళా శక్తితో ముడిపడి ఉన్నాయని ఆమె గుర్తు చేశారు. పురుషులు సంపాదనలో, కుటుంబ పోషణలో మంచి పాత్ర పోషించినప్పటికీ, ఒక మహిళా చేసే బహుముఖ పనులను వారు చేయలేరని ఆమె అభిప్రాయపడ్డారు. తదనంతరం ఫిక్కీ ఫ్లో విజయవాడ చాప్టర్ చైర్ పర్సన్ అమ్రిత కుమార్ మాట్లాడుతూ సమాజాభివృద్ధికి,మహిళాభివృద్ధికి తమ చాప్టర్ ఎంతగానో కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను కలెక్టర్ లక్ష్మీ షా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సతీమణి సుప్రిత, ఫిక్కీ ఫ్లో విజయవాడ చాప్టర్ సీనియర్ చైర్ పర్సన్ సుప్రియ మలినేని,దీప్తి చలసాని, తులజ , దుర్గా సౌజన్య తదితరులు పాల్గొన్నారు.





# పెద్ది షూటింగ్‌లో రామ్‌చరణ్‌కు స్వల్ప గాయం

మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం బుచ్చిబాబు సానా దర్శకత్వంలో 'పెద్ది' చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఏప్రిల్ 30న ఈ చిత్రం విడుదల కానుండగా.. వీలైనంత త్వరగా షూటింగ్ ఫినిష్ చేసేలా దూసుకుపోతోంది చిత్ర యూనిట్. ప్రజెంట్ హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. అయితే, ఈ చిత్రానికి సంబంధించిన ఒక కీలకమైన యాక్షన్ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న సమయంలో రామ్ చరణ్‌కు గాయం అయినట్టుగా తెలుస్తోంది. ఆయన కంటి సమీపంలో స్వల్ప గాయం అయిందని సమాచారం. ఈ వార్త తెలియగానే అభిమానులు కాస్త ఆందోళన చెందినప్పటికీ, ఇది చాలా చిన్న గాయమని, అభిమానులు భయపడాల్సిన అవసరం లేదని చిత్ర యూనిట్ వర్గాలు తెలిపాయి. అయితే, కంటికి సంబంధించిన గాయం కావడంతో జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచించారు. అలాగే.. రెండు రోజుల పాటు పూర్తి విశ్రాంతి అవసరమని డాక్టర్లు సలహా ఇచ్చారు. దీంతో.. రెండు రోజుల రెస్ట్ తర్వాత తిరిగి రామ్ చరణ్ పెద్ది సెట్స్‌లో జాయిన్ అవనున్నారు. ఈ షెడ్యూల్ అయిపోయిన తర్వాత.. తదుపరి షెడ్యూల్‌లో ఒక స్పెషల్ సాంగ్ చిత్రీకరణలో పాల్గొననున్నారు. ఇక్కడితో షూటింగ్ దాదాపుగా కంప్లీట్ అయినట్టే. మరోవైపు, ఈ శుక్రవారం మార్చి 27న రామ్ చరణ్ పుట్టినరోజు కావడంతో మెగా సెలబ్రేషన్స్‌కు సిద్ధమవుతున్నారు అభిమానులు. ఆరోజు పెద్ది టీజర్ లేదా గ్లింప్స్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఇలాంటి సమయంలో చరణ్‌కు గాయం అనే వార్త మెగాభిమానులను కాస్త టెన్షన్‌కు గురి చేసినట్లైంది. తమ అభిమాన హీరో త్వరగా కోలుకోవాలని సోషల్ మీడియా వేదికగా కోరుకుంటున్నారు అభిమానులు. ఈ క్రమంలోనే తాజాగా రామ్ చరణ్ గాయం మీద పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, స్పందించారు.

ఈ మేరకు మీడియాకు సమాచారం అందించారు. త్వరగా రామ్ చరణ్ కోలుకోవాలని పవన్ కళ్యాణ్ ఆకాంక్షిస్తున్నట్లుగా పవన్ కళ్యాణ్ టీం ఒక మెసేజ్ షేర్ చేసింది. అయితే ఇప్పటివరకు రామ్ చరణ్ కి గాయాలు అయినట్లుగా 'పెద్ది' టీం కానీ, రామ్ చరణ్ టీం కానీ ప్రకటించలేదు. కానీ పవన్ కళ్యాణ్ స్పందించడంతో, ఈ వార్త కన్ఫామ్ అయినట్లయింది.

# ఇన్‌స్టాలోకి అన్నా కొణిదెల



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ భార్య అన్నా లెజినోవా ఇప్పుడు సోషల్ మీడియాలోకి అడుగుపెట్టి 'అన్నా కొణిదెల'గా మారింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె ఖాతా ప్రారంభించగానే అభిమానుల నుంచి భారీ స్పందన లభిస్తోంది. ముఖ్యంగా ఆమె తొలి పోస్టు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. మొదటి పోస్ట్ సాధారణ పరిచయంకి సంబంధించింది కాగా , రెండో పోస్టులో భర్త పవన్ కళ్యాణ్‌తో కలిసి ఉన్న ఫోటోను షేర్ చేయడం ప్రత్యేకతను సంతరించుకుంది. తన బయోలో ' రష్యన్ హార్ట్ , ఇండియన్ సోల్ అని పేర్కొనడం ద్వారా తన వ్యక్తిత్వాన్ని అందంగా వ్యక్తపరిచారు అన్నా లెజినోవా. రష్యాలో జన్మించిన ఆమె, భారతీయ కుటుంబంలోకి కోడలిగా చేరిన తర్వాత రెండు సంస్కృతుల సమ్మేళనంగా జీవిస్తున్నానని తెలియజేసింది. అలాగే ప్రేమ, కృతజ్ఞతలతో జీవిస్తూ నిరంతరం నేర్చుకుంటూనే ఉంటానని కూడా తన ప్రొఫైల్‌లో తెలియజేశారు. ఇన్‌స్టాగ్రామ్ ఎంట్రీ సందర్భంగా షేర్ చేసిన పోస్టులో, చాలా కాలంగా సోషల్ మీడియాలోకి రావాలని అనుకున్నానని, ఇప్పుడు సరైన సమయం అనిపించిందని తెలిపారు. చిరంజీవి ఆశీస్సులు, పవన్ కళ్యాణ్ మద్దతుతో ఈ కొత్త ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నానని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ఆమె ఖాతా ప్రారంభించిన కొద్ది గంటల్లోనే ఫాలోవర్స్ సంఖ్య లక్ష దాటడం విశేషం.

అన్నా కొణిదెల ఇన్‌స్టాలోకి ఎంట్రీ ఇవ్వడంతో పవన్ కళ్యాణ్ తన భార్యకు స్వాగతం పలుకుతూ ఒక పోస్ట్ చేశాడు. 'డియర్ అన్నా కొణిదెల, ఇన్‌స్టాగ్రామ్‌లోకి నీకు సాదర స్వాగతం.. ఈ వేదిక ద్వారా నువ్వు అర్థవంతమైన మరియు స్ఫూర్తిదాయకమైన విషయాలను పంచుకుంటావని ఆశిస్తున్నాను' అంటూ శుభాకాంక్షలు తెలియజేశారు.

# దురంధర్ -2 కలెక్షన్ల సునామీ




బాలీవుడ్ స్టార్ రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో, ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్: ది రివెంజ్' బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేస్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే ఈ సినిమా కలెక్షన్ల సునామీ సృష్టిస్తూ, రికార్డులను తిరగరాస్తోంది. ట్రేడ్ వర్గాల లెక్కల ప్రకారం, కేవలం ఆరు రోజుల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 919 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించడం విశేషం. ఇందులో ఇండియాలోనే రూ. 695 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లు నమోదు చేయడం సినిమా దూకుడుకు నిదర్శనం. వీక్‌డేస్‌లో కూడా కలెక్షన్లు ఏ మాత్రం తగ్గడం లేదు. ఐదో రోజు రూ. 65 కోట్లు, ఆరవ రోజు రూ. 56 కోట్లకు పైగా నెట్ కలెక్షన్లు రాబట్టింది. ఇక ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా 'ధురంధర్ 2' దూసుకుపోతోంది. ఇప్పటికే రూ. 200 కోట్ల మార్క్‌ను దాటేసి, గ్లోబల్ స్థాయిలో భారీ వసూళ్లను అందుకుంటోంది. ఈ వేగాన్ని చూస్తుంటే, కేవలం వారం రోజుల్లోనే రూ. 1000 కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయం అని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అదే జరిగితే అత్యధిక వేగంగా వారం రోజుల్లోనే వెయ్యి కోట్లు రాబట్టిన చిత్రంగా సరికొత్త రికార్డ్ క్రియేట్ చేయనుంది ధురంధర్ 2. సుమారు నాలుగు గంటల భారీ రన్‌టైమ్ ఉన్నప్పటికీ, ప్రేక్షకులు ఈ సినిమాను ఆదరించడం విశేషం. మొదటి భాగం సుమారు రూ. 1400 కోట్ల వసూళ్లు సాధించిన నేపథ్యంలో, 'ధురంధర్ 2' రూ. 2000 కోట్ల మార్క్‌ను అందుకునే అవకాశముందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. బాలీవుడ్‌లో హిట్ సినిమాలకు లాంగ్ రన్ ఉండటం ఈ అంచనాలకు బలం ఇస్తోంది. ఈ చిత్రంలో రణ్‌వీర్ సింగ్ తన పవర్‌ఫుల్ యాక్షన్‌తో ప్రేక్షకులను ఆకట్టుకోగా, అర్జున్ రాంపాల్, సంజయ్ దత్, ఆర్. మాధవన్ వంటి స్టార్ నటులు కీలక పాత్రల్లో మెప్పించారు. మొత్తానికి 'ధురంధర్ 2' భారతీయ సినీ చరిత్రలో కొత్త రికార్డులను సృష్టించే దిశగా దూసుకెళ్తోంది.

# హైదరాబాద్‌లో వారణాసి నిర్మాణం



రాజమౌళి అంటేనే ప్రతి విషయంలోనూ ఎంత అదనపు శ్రద్ధ తీసుకుంటారో తెలిసిందే. ఇక సెట్స్‌పై ఆయన విజన్ మరింత ప్రత్యేకం. తాజాగా వైరలవుతోన్న వారణాసి సెట్ ఇమేజ్‌లు మరోసారి జక్కన్న పనితీరును చాటిచెబుతున్నాయి. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా రానున్న చిత్రం 'వారణాసి'. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీప్రియులు దీనికోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దీంతో దీనికి సంబంధించిన చిన్న అప్‌డేట్ కూడా క్షణాల్లో వైరల్ అవుతోంది. తాజాగా ఈ సినిమా కోసం వేస్తోన్న సెట్ ఇమేజ్‌లు వైరల్‌గా మారాయి. ఈ సినిమా కాశీ నేపథ్యంలో సాగే విషయమని తెలిసిందే. దీంతో కాశీ నగరాన్ని తలపించేలా సెట్‌ను నిర్మిస్తున్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని పురాతన నగరం వారణాసిని అచ్చుగుద్దినట్లు చూపించేలా దాదాపు 700 మీ 400 అడుగుల విస్తీర్ణంలో ఈ భారీ సెట్‌ను నిర్మించారు. వారణాసిలోని ప్రతి వీధి, ప్రతి కట్టడాన్ని తలపించేలా దీన్ని రూపొందిస్తున్నారు. వేల సంఖ్యలో రిఫరెన్స్ చిత్రాలను, కచ్చితమైన కొలతలను వాడినట్లు చిత్ర బృందం పేర్కొంది. ఇక ఈ సెట్‌లో రత్నేశ్వర్ మహాదేవ్ ఆలయం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందట. దీని గోపురం వంపు తిరిగి ఉంటుందని ఈ సెట్‌లో ఆ ఆలయాన్ని కూడా అదే కోణంలో, అదే ఎత్తులో రూపొందిస్తున్నట్లు సమాచారం. నిర్మాణ సమయంలో ఏ చిన్న అలంకరణను, శిల్పకళలను మిస్ కాకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా కథ త్రేతాయుగం నుంచి 2027 వరకూ సాగనున్నట్లు తెలుస్తోంది. దీనికి అనుగుణంగా వారణాసి నగరం కాలక్రమేణా ఎలా మారిందో చూపించడానికి సెట్‌లో ప్రత్యేక మార్పులు చేస్తున్నారు. అప్పటి కట్టడాల నంచి నేటి ఆధునిక కాలం వరకు ప్రతీది ప్రత్యేక శ్రద్ధతో నిర్మిస్తున్నట్లు తాజాగా టీమ్ పంచుకున్న ఫొటోలు చూస్తే అర్థమవుతుంది. వారణాసిలోని గంగా నది తీరం, అక్కడి పురాతన కట్టడాలను తలపించేలా హైదరాబాద్‌లో ఒక భారీ సెట్‌ను రాజమౌళి నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. రాజమౌళి తన సినిమాల్లో లొకేషన్లకు ఇచ్చే ప్రాధాన్యత గురించి అందరికీ తెలిసిందే. ఈ సినిమాలో ఒక కీలకమైన సన్నివేశం వారణాసి నేపథ్యంలో సాగుతుందని, అందుకే ఈ భారీ సెట్ పనులు జరుగుతున్నాయని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. మహేష్ బాబు ఈ సినిమాలో ఒక సాహసికుడిగా కనిపించబోతున్నారు. గ్లోబ్ ట్రాటింగ్ నేపథ్యంలో సాగే ఈ కథలో భారతీయ సంస్కృతిని ప్రతిబింబించేలా వారణాసి వంటి పుణ్యక్షేత్రాలను కూడా జోడించడం రాజమౌళి మార్క్ అని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చిత్రాలలోని గ్రాండియర్ చూస్తుంటే, రాజమౌళి మరోసారి ఇండియన్ సినిమా స్థాయిని ప్రపంచ దేశాలకు చాటిచెప్పేలా ప్లాన్ చేస్తున్నట్లు అర్థమవుతోంది. ప్రస్తుతం మహేష్ బాబు తన మేకోవర్ కోసం కఠినమైన శిక్షణ తీసుకుంటున్నారు. పొడవాటి జుట్టు,

# సర్కే చునార్ తేరీ సర్కేలో అశ్లీలం తెలియదు

ప్రేమ్ దర్శకత్వంలో రాబోతున్న 'కేడీ: ది డెవిల్' సినిమాలోని 'సర్కే చునార్ తేరీ సర్కే' పాట వివాదాస్పదమైన విషయం తెలిసిందే. అన్ని వేదికల్లోనూ ఈ పాటను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) అధికారులను ఆదేశించింది. తాజాగా ఈ పాట వివాదంపై దర్శకుడు ప్రేమ్ స్పందించారు. తనకు కూడా ఆ హిందీ పాట లిరిక్స్ అర్థం తెలియదని అన్నారు. 'ఈ పాట ఐదు భాషల్లో విడుదలైంది. కన్నడలో లిరిక్స్ నేను రాశా. హిందీపై నాకు పట్టులేదు. అందుకే వాటి అర్థం తెలియదు. ప్రస్తుతం దేశంలో ఎన్నో సమస్యలు ఉన్నాయి. ఒకవైపు యుద్ధం, మరోవైపు గ్యాస్ కొరత.. ఇలాంటి వాటి గురించి చర్చించుకుందాం. అంతేగానీ, ఈ పాట లిరిక్స్‌ను వివాదం చేయాల్సిన అవసరం లేదు' అని అన్నారు. ఇక ఉద్దేశపూర్వకంగానే దీన్ని వివాదం చేస్తున్నారంటూ వస్తోన్న వార్తలను ప్రేమ్ ఖండించారు. తాను వివాదాలకు దూరంగా ఉంటానన్నారు. ఇది ఎమోషనల్ మూవీ అని.. ఇందులో ఆ పాట కేవలం పార్టీలో భాగంగా సరదాగా ఉంటుందని చెప్పారు. ఇటీవల ఈ అంశంపై ప్రేమ్ భార్య రక్షిత కూడా స్పందించిన విషయం తెలిసిందే. గతంలో 'పీలింగ్స్', 'డ్రీమమ్ వేకపమ్', 'చోళీ కే పీచే' వంటి వందలాది పాటలు వచ్చినప్పుడు అందరికీ అవి సాధారణంగానే అనిపించాయని.. ఇప్పుడెందుకు ఈ పాట విషయంలో ఇలా చేస్తున్నారని అసహనం వ్యక్తంచేశారు. ధ్రువ్ సర్జా కథానాయకుడిగా నటించిన ఈ మూవీలో నోరా ఫతేహి, సంజయ్‌దత్ కీలక పాత్రలు పోషించారు. ఏప్రిల్ 30న ఈ సినిమా విడుదల కానుంది.




Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu… EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.